

నిష్పక్షపాత వార్తల నిజరూపం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

గురువారం 11-06-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 66 రూ॥ 6.00





చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888




# ఉత్తుతి మాటలు చెప్పలే.. ఉత్తగా తెలంగాణ రాలే!

నేటిధాత్రి Exclusive

## 60 ఏళ్ల ఆరాటం..14 ఏళ్ల "కేసీఆర్" పోరాటం

- ఊహకందని ఉద్యమ రూపాలు.. "కేసీఆర్" రచించిన వ్యూహాలు.
- "కేసీఆర్" మాట విని పసి పాప గజ్జె కూడా గల్లు మన్నది.
- తెలంగాణ మాట వినిపిస్తే తొట్టెల్లో పాప కేకలతో జేజేలు కొట్టింది.
- "కేసీఆర్" జై తెలంగాణ అంటే లేగ దూడ కూడా లేచి లేచి ఆడింది.
- పండు ముసలి కూడా కాలు కదిలింది.
- తెలంగాణ సమాజాన్ని మొత్తం ఏకం చేశారు.
- కవులు, కళాకారులను ప్రోత్సహించారు.
- తెలంగాణ విద్యావంతుల వేదికను బలోపేతం చేశారు.
- ధూమ్, ధామ్ కార్యక్రమాలకు ఉద్యమ కారులు హాజరయ్యేలా చూశారు.
- తెలంగాణ లోని యూనివర్సిటీలన్నింటిలో సెమినార్లు ఏర్పాటు చేయించారు.
- విద్యార్థి విభాగం నాయకులను తయారు చేశారు.



**హైదరాబాద్, నేటిధాత్రి:**
దేశ చరిత్రలోనే తెలంగాణ ఉద్యమం ఒక మహోన్నత ఘట్టం. అందులో మలి దశ తెలంగాణ అనేది ఉజ్వలమైన ఘట్టం. కేంద్ర ప్రభుత్వం డెబ్బై ఏళ్లక్రితం చిన్న పిల్లలు బొమ్మల పెళ్లి చేసినంత సులువుగా, రెండు తెలుగు రాష్ట్రాలను కలిపారు. విడదీయడానికి మాత్రం అరవైఏళ్ల సమయం తీసుకున్నారు. తెలంగాణ, ఆంధ్రను కలిపినప్పుడు గడుసు పిల్లవాడి చేతిలో, అమాయకపు పిల్లను పెడుతున్నామని చెప్పి, చేతులు దులుపుకున్నారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో తెలంగాణకు తీరని అన్యాయం చేశారు. తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా రెండు రాష్ట్రాలను కలిపేశారు. ఆంధ్రులు పెత్తనం కింది తెలంగాణను నలిగిపోయేలా చేశారు. ఆంధ్రా నాయకులు చెప్పే మాటలు వింటూ, తెలంగాణ వాదనలను అరణ్య రోధనలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలపొద్దని ఫజల్ అలీ కమీషన్ ఎంత చెప్పినా పట్టించుకోలేదు. మొదటి ఎస్సార్సీ పేరుతో తెలంగాణ గొంతు కోశారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో తెలంగాణకు తీరని నష్టం చేకూర్చారు. ఉత్తరాదిన వున్న హిందీ రాష్ట్రాలు ఎన్ని వున్నా ఫరవాలేదనుకున్నారు. కాని తెలుగు బాషకు మాత్రం రెండు రాష్ట్రాలు లేకుండా చేశారు. అలా తెలంగాణను వంచించారు. తెలంగాణకు ద్రోహం చేశారు. తెలంగాణ, ఆంధ్రా కలిసి నాటి నుంచే తెలంగాణ ఉద్యమం సాగింది. అడుగడుగునా తెలంగాణ వాదనలు పక్కన పెడుతూ వచ్చారు. తెలంగాణను అన్యాయం చేస్తున్న ఆంధ్రా నాయకులను అందలమెక్కిస్తూ వచ్చారు. 1948 వరకు నిజాం కింద నిలిగిపోతున్న తెలంగాణ స్వేచ్ఛను కోరుకున్నది. పెనం వున్న తెలంగాణను తీసుకొచ్చి ఆంధ్రాతో కలిపి నిప్పుల్లో వేశారు. తెలంగాణను సర్వనాశనం చేశారు. పోరాటాలు కొత్త కాని తెలంగాణ సమాజం 1969లో పెద్దఎత్తున ఉద్యమం సాగినా, ఉద్యమకారులను పిట్టలను కాల్చినట్లు కాల్చారు. ఉద్యమాన్ని మాయం చేశారు. తెలంగాణకు ప్రత్యేక హక్కులిస్తామని మభ్యపెట్టి మరోసారి ముంచారు. ఆంధ్రా ఆదిపత్యానికే కేంద్ర పెద్దలు రెడ్ కార్పెట్ వేస్తూ వచ్చారు. అలా ఆంధ్రా పాలకులు చేతుల్లో నలిగిపోతున్న తెలంగాణను కాపాడేందుకు ఒక్కడు కదిలారు. ఆ ఒక్కడే కేసిఆర్. మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని రగిలించాడు. తెలంగాణ తెచ్చేదాకా విశ్రమించని శపథం చేశారు. అలా ఆనాడు చేసిన శపథం చివరిదాకా కొనసాగించారు. తెలంగాణ పడుతున్న వేదన, ప్రజల రోధన చూసిన చలించిన కేసిఆర్ తెలంగాణ వాదాన్ని ఎత్తుకున్నారు. గులాబీ జెండాతో తెలంగాణ సాదనకు కంకణం కట్టుకున్నారు. తెలంగాణ సాదించారు. అయితే తెలంగాణ పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటం ఉత్తగ సాగలేదు. దేశ చరిత్రలో స్వాతంత్ర్యం సంగ్రామం వందేళ్లు సాగింది. అందులో మహాత్మా గాందీ చేరిన తర్వాత పోరాటం ఎవరెస్టు శిఖరం అందుకున్నది.

- నిరంతరం యూనివర్సిటీలలో ఉద్యమం సజీవంగా ఉండేలా చూసుకున్నారు.
- ఉద్యమ స్వరూపాలలో కూడా వైవిద్యం చూపించారు.
- ఉద్యమాన్ని రాజకీయం తో ముడిపెట్టి పోరు సాగించారు.
- రాజకీయంగా చట్ట సభలలో బలంగా గొంతు వినిపించారు.
- తెలంగాణ ఏర్పాటు అనివార్యతపై చర్చ చేశారు.
- తెలంగాణకు జరిగిన అన్యాయం మీద ప్రశ్నిస్తూ వచ్చారు.
- తెలంగాణ ఎలా దోపిడీకి గురైందో ప్రపంచానికి తెలిసేలా చేశారు.
- ఇటు క్షేత్ర స్థాయిలో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేశారు.
- ఆఖరుకు ప్రాణ త్యాగానికి సిద్దపడ్డారు.

అలాగే దేశంలో అంతటి సుధీర్ఘమైన పోరాటం తెలంగాణలో సాగింది. అరవై సంవత్సరాల పాటు సాగిన తెలంగాణ ఉద్యమంలో 2000 సంవత్సరంలో కేసిఆర్ వచ్చారు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మా గాందీ స్పూర్తిగా కేసిఆర్ తెలంగాణ పోరాటం సాగించారు. అహింసాయుత పద్దతిలో తెలంగాణ సాదన జరుగుతుందని చెప్పారు. తెలంగాణ సాధించి చూపించారు. నెత్తుటి చుక్క కింద రాలకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. సకల జనులను మేల్కొలిపారు. ఈ తరం తెలుసుకోవాల్సిన విషయాలు అనేకం వున్నాయి. కేసిఆర్ ఉత్తుత్తి మాటలు చెప్పలేదు. ఉత్తగానే తెలంగాణ రాలేదు. ఏ రాజకీయపార్టీ ఊహకందని ఉద్యమ రూపాలను కేసిఆర్ రచించారు. అనేక రాజకీయ, ఉద్యమ వ్యూహాలు అమలు చేశారు. ఉద్యమ స్వరూపాలకు కొత్త అర్దం చెప్పారు. అటు ఉద్యమం, ఇటు రాజకీయం రెండూ కలిపి తెలంగాణ పోరాటం రచించారు. ప్రజలు కేత్ర స్థాయిలో ఉద్యమాలు సాగించేలా, నాయకులు చట్ట సభల్లో తెలంగాణవాణి వినిపించేలా కొత్త తరహా ఉద్యమానికి ఊపిరిపోశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఎప్పుడూ సజీవంగా వుంచేందుకు కేసిఆర్ ఆడిన రాజకీయక్రీడలో కాంగ్రెస్‌కు ఊపిరి సలపకుండా చేశారు. పదే పదే రాజీనామాలు చేస్తూ, తెలంగాణ సమాజాన్ని మొత్తం కూడగట్టారు. తెలంగాణలో మేధావి వర్గాన్ని, కవులను, కళాకారులను ఏకం చేశారు. ఉద్యోగ వర్గాలను ఏక తాటిపైకి తెచ్చారు. జర్నలిస్టులు, న్యాయవాదుల చేత ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. సకల జనులను తెలంగాణ ఉద్యమంలో బాగస్వాములను చేశారు. ఆంధ్రా నాయకులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. కేంద్రాన్ని నిద్రపోనియ్యకుండా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేత 2004 ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వాగ్దానం చేయించారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలంగాణ రాష్ట్రం ఇస్తామని చెప్పించారు. కేంద్రంలో 2004లో రాష్ట్రపతి తొలి ప్రసంగంలో తెలంగాణ ఏర్పాటు అంశాన్ని చేర్చేలా చేశారు. ఇలా దేశమంతా తెలంగాణ ఉద్యమం గురించి తెలుసుకునేలా చేశారు. కేంద్ర మంత్రి వర్గంలో చేరి, దేశంలోవున్న 34 రాజకీయ పార్టీ మద్దతు కూడగట్టారు. ఆయా పార్టీలనుంచి ఉత్తరాలు తీసుకున్నారు. తెలంగాణకు వ్యతిరేకం అని ప్రకటించిన ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి కూడా జై తెలంగాణ అనేలా చేశారు. తెలంగాణ గోస గురించి కేసిఆర్, మాయావతికి చెప్పి, జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఆమె కన్నీరు పెట్టుకునేలా పరిస్థితి వివరించారు. అలా రాజకీయ ప్రక్రియను, ఇటు ఉద్యమ ప్రస్థానం సాగించారు. కాని కాంగ్రెస్ నాయకులు ఆనాడు జై తెలంగాణ అనేందుకు కూడా ఇష్టపడలేదు. కేంద్రం తెలంగాణ ఇస్తామని చెప్పిన తర్వాత కూడా ఆంధ్రా నాయకులకు అడుగులకు మడుగులొత్తుతూ పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు పాకులాడారు. తెలంగాణ వాదమే లేని కూడా కొంత మంది ప్రచారం చేశారు. తెలంగాణ వాదమే వుంటే కేసిఆర్ పార్టీ సీట్లెందుకు గెలవలేదని ఎద్దేవా చేస్తూ వచ్చారు. కేసిఆర్‌న రెచ్చగొట్టి రాజీనామా చేయించారు. కేసిఆర్ కాంగ్రెస్ వల్లనే గెలిచాడంటూ హేళన చేశారు. ఆసమయంలో రాజీనామా చేసిన కేసిఆర్ ఎన్నికల్లో 2004 ఎన్నికల్లో వచ్చిన మెజార్టీకి మించి విజయం సాదించారు. ఎమ్మెల్యేల చేత కూడా తర్వాత రాజీనామా చేయించారు. ఆ సమయంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణ ఇస్తామని, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారు. ఇలా అడుగడుగునా పదవుల కోసం ఆరాటపడే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ వాదం లేదని చెప్పడానికే ప్రయత్నం చేశారు. ఓ వైపు ఆంధ్రా ప్రాంత ఎంపిలు తెలంగాణ ఇచ్చేది లేదు. అని ప్రకటిస్తుంటే, తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం మౌనం వహించేవారు. కనీసం వాళ్లను అడ్డుకునే ప్రయత్నం చేసేవారు కాదు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని కూడా చెప్పే ధైర్యం చేయలేకపోయేవారు. ఓవైపు ఆనాటికాంగ్రెస్ పాలకుల నిర్భందాలు, ఉద్యమ కారులపై కేసులు, తెలంగాణ కోసం యువత ఆత్మ బలిదానాలతో చలించిపోయిన కేసిఆర్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టారు. కేసిఆర్ ప్రాణాలకు ఏమైనా జరిగితే తెలంగాణ అగ్ని గుండమౌతుది. దేశమంతా కాంగ్రెస్‌కు వ్యతిరేక ఉద్యమాలు మొదలౌతాయి అని కాంగ్రెస్ పెద్దలు భయపడ్డారు. 2009 డిసెంబర్9న తెలంగాణ ప్రకటన చేశారు. అదే ఆ సంతోషం ఒక్క పూట కూడా లేకుండా మళ్లీ ఆంధ్రా నాయకులు మొత్తం ఏకమై, పార్టీలకతీతంగా రాజీనామాలు చేశారు. దాంతో కేంద్రం ప్రకటించిన తెలంగాణపై యూటర్న్ తీసుకున్నది. అప్పుడు కూడా తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు సోయి రాలేదు. వచ్చిన తెలంగాణను అడ్డుకున్న ఆంధ్రా నాయకులకు ఎదురుచెప్పలేదు. కేసిఆర్ ఒత్తిడి మేరకు రాజీనామాలు చేసినట్లే చేసి, కాంగ్రెస్ మంత్రులు మళ్లీ ఉపసంహరించుకున్నారు.

- ఆమరణ దీక్ష చేపట్టారు.
- తెలంగాణ సాధించారు.
- తెలంగాణను పదేళ్లలో బంగారు తెలంగాణ చేశారు.
- ఎడారి లాంటి తెలంగాణ సస్యశామలం చేశారు.
- చీకటి ని తరిమి వెలుగులు పంచారు.
- పదేళ్లలో తెలంగాణను "కేసీఆర్" నెంబర్ వన్ చేశారు.

తెలంగాణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా ఆంధ్రా నాయకులు ఇక తెలంగాణ జన్మలో రాదంటూ మాట్లాడుతున్నా, కాంగ్రెస్ నాయకులు నోరు, చెవులు మూసుకునేవారు. కాని ఏనాడు ఆంధ్రా నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కేసిఆర్ జేఏసి ఏర్పాటు చేస్తే అందులో చేరినట్లే చేరి కాంగ్రెస్ నాయకులు తప్పుకున్నారు. ఇప్పుడేమో తెలంగాణ ఇచ్చింది మేమే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. కేసిఆర్ ఉద్యమం చేయకపోతే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చేదా? కేసిఆర్ లేని తెలంగాణ ఉద్యమం ఊహించగలమా? తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉద్యమ చరిత్రను కాలరాయాలని కొంత మంది కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారు. ఆంధ్రానాయకులతో చేతులు కలిపి,మళ్లీ తెలంగాణను ఆగం చేయాలని చూస్తున్నారు. తెలంగాణ తెచ్చినకేసిఆర్‌ను తూలనాడుతున్నారు. తెలంగాణకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. కాని కేసిఆర్ వున్నంత వరకుతెలంగాణలో గడ్డి పరకను కూడాఎవరూ కదిలించలేరు.



నిష్పక్షపాత వార్తల నిలయం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక



గురువారం 11-06-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 66 రూ॥ 6.00





## చిక్కుముడుల్లో

# గోదావరి -కావేరి అనుసంధాన ప్రాజెక్టు

- కేంద్ర ప్రభుత్వ ఎన్ డబ్ల్యుడిఎ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు
- ఒరిజినల్ డిపిఆర్‌కు మార్పులు ప్రతిపాదించిన ఏపీ
- దీనికి తెలంగాణ అభ్యంతరాలు
- ఒరిజినల్ డీపీఆర్‌లో పేర్కొన్న ఇచ్చంపల్లి రూట్‌ను అంగీకరించని ఏపీ
- చివరకు సుప్రీంకోర్టుకు వెళ్లిన తెలంగాణ ప్రభుత్వం
- గోదావరి జలాలపై తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదం
- తమిళనాడుకర్ణాటకల మధ్య వివాదం
- ప్రాజెక్టు అమలైతే కర్ణాటక వాటా అడుగుతుందని తమిళనాడు భయం
- కావేరీ జలాలపై ఇప్పటికే రెండు రాష్ట్రాల మధ్య వివాదం
- తాగు, సాగునీటి సమస్యతో తమిళనాడు సతమతం
- ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్రంపై ఒత్తిడి
- తమిళనాడుకు కేంద్రం హామీలు
- తెలంగాణలో అధికారావిపక్షాల మధ్య విమర్శల హోరు

హైదరాబాద్, నేటిధాత్రి:
గోదావరి–నల్లమల సాగర్ ప్రాజెక్టును పాలమూరు ప్రాజెక్టులో ముడిపెట్టడం తెలంగాణ జలహక్కులను కాలరాయడమేనని తాజాగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొనడంతో గోదావరి–కావేరి అనుసంధాన ప్రాజెక్టు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రస్తుతం పోలవరం నుంచి నల్లమలసాగర్ అక్కడినుంచి కావేరికి నీటిని తరలించడం వల్ల తెలంగాణకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆయన గట్టిగా వాదించారు. ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్కసాగర్‌నుంచి మాత్రమే నాగార్జునసాగర్‌కు అనుసం ధానించాలని మాత్రమే బీఆర్ఎస్ కోరిన సంగతి ఆయన గుర్తుచేశారు. ఈ అనుసంధానంలో 50శాతం నీటిని తెలంగాణకు కేటాయించాలని కూడా తాము కోరామన్నారు. గోదావరి–కావేరి లింక్ అమలయితే తెలంగాణకు కనీసం 211టీఎంసీల నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. పోలవరం–బనక చర్ల మీదుగా నీటిని తరలిస్తే రూ.82వేల కోట్లు వ్యయం అయితే, తెలంగాణ మీదుగా నదుల అనుసంధానం జరిగితే కేవలం రూ.48కోట్లకే సాధ్యమన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్‌లు ఈ గోదావరి–కావేరి అనుసంధానంపై భిన్న వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో అసలు ఈ ప్రాజెక్టు పై అవగాహన ఏర్పరచుకుంటే ఎవరి వాదనలు సమంజసమో అర్థం చేసుకోవచ్చు.

## ఎన్ డబ్ల్యుడిఎ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు

గోదావరి–కావేరి నదుల అనుసంధానం అనేది కేంద్ర ప్రభుత్వ జాతీయ జల అభివఅద్ధి సంస్థ (ఎన్ డబ్ల్యుడిఎ) ప్రతిపాదించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు. గోదావరి నదిలోని అదనపు (మిగులు) జలాలను కఅష్ణా, పెన్నా మరియు కావేరి నదీ బేసిన్‌లకు మళ్లించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా ఈ ప్రాజెక్టు ప్రయాణిస్తుంది. గోదావరి (ఇచ్ఛంపల్లి/సమ్మక్క బ్యారేజ్) నుంచి నాగార్జున సాగర్, సోమశిల మీదుగా కావేరి నది (గ్రాండ్ ఆనికట్ – తమిళనాడు) వరకు సుమారు 1,211 కి.మీ. నిడివితో ఈ కాల్వలను నిర్మించాలని ప్రతిపాదించారు. సుమారు 148 టీఎంసీల గోదావరి నీటిని మళ్లించాలని ప్రణాళిక. సుమారు రూ.39,275 కోట్ల నుండి రూ.63,868 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా.

## ప్రాజెక్టు డీపీఆర్ ముఖ్యాంశాలు

కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడీఏ) ఈ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. దీని ప్రకారంగోదావరి బేసిన్ నుండి ఏటా 141 నుండి 148 టీఎంసీల మి గులు జలాలను మళ్లించాలని ప్రతిపాదించారు. మొదటి దశలో గోదావరి (సమ్మక్క సాగర్/ఇ చ్ఛంపల్లి) నుండి నాగార్జున సాగర్ (కఅష్ణా నది) వరకు, రెండవ దశలో నాగార్జున సాగర్ నుండి సోమశిల (పెన్నా నది) వరకు, చివరి దశలో సోమశిల నుండి గ్రాండ్ ఆనికట్ (కావేరి నది) వరకు నీటిని తరలిస్తారు. నీటి వఅధా మరియు భూసేకరణ సమస్యలను తగ్గించడానికి చాలా చోట్ల ఓపెన్ కెనాల్స్ కాకుండా ప్రెజర్ పైప్‌లైన్ల ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని డీపీఆర్‌లో ప్రతిపా దించారు. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టుపై భాగస్వామ్య రాష్ట్రాల మధ్య ఎటువంటి అధికారిక ఒప్పందం కుదరలేదు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో పలుమార్లు టాస్క్‌ఫోర్స్ సమావేశాలు జరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు ఉన్నాయి.గోదావరిలో అసలు మిగులు జలాలు లేవని, ముందుగా గోదావరి ట్రిబ్యునల్ ద్వారా రాష్ట్రాల వాటాలను తేల్చాలని తెలంగాణ పట్టుబడుతోంది. ఒకవేళ ప్రాజెక్ట్ చేపడితే, లింక్ రూట్ తెలంగాణ నుంచే వెళ్లాలని, అందులో సగం నీరు (సుమారు 70 టీఎంసీలు) తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇచ్ఛంపల్లి రూట్‌ను వ్యతిరేకి స్తోంది. పోలవరం ప్రాజెక్ట్ కుడి కాల్వ ద్వారా లేదా ప్రకాశం బ్యారేజ్ కింద ఉన్న మారుతీపురం/బనకచర్ల నుండి నాగార్జునసాగర్, సోమశిల మీదుగా కావేరికి నీటిని తరలించాలని (గోదావరి–కఅష్ణా–పెన్నా–కావేరి రూట్) ప్రత్యామ్నాయ ప్రణాళికను కేంద్రం ముందు ఉంచింది. దీనిపై తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కావేరి డెల్టాలో నీటి కొరత తీవ్రం గా ఉన్నందున, ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని తమిళనాడు కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెస్తోంది. రాష్ట్రాల మధ్య ఒకేసారి పూర్తి ఒప్పందం కుదరడం కష్టంగా మారడంతో, కేంద్రం దశలవారీగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని చూస్తోంది. మొదటగా గోదావరి – కఅష్ణా (నాగార్జున సాగర్) లింక్‌ను పూర్తి చేసి, ఆ తర్వాత కావేరి వరకు పొడిగించేలా రాష్ట్రాలను ఒప్పించే ప్రయత్నం చేస్తోంది.

## ప్రభావిత రాష్ట్రాలకు ప్రయోజనాలు

తమిళనాడు రాజధాని చెన్నై నగరానికి తాగునీటి అవసరాల కోసం, ఇతర ప్రాంతాలకు కలిపి సుమారు 41 టీఎంసీల నీరు లభిస్తుంది. కావేరి డెల్టా ప్రాంతంలో నీటి ఎద్దడి తగ్గి, సుమారు 5.74 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు స్థిరమైన సాగునీరు అందుతుంది.ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, కఅష్ణా, గుంటూరు మరియు చిత్తూరు జిల్లాల్లోని సుమారు 3.45 నుండి 5.04 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందుతుంది. పెన్నా నది బేసిన్‌లో అదనపు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.తెలంగాణలోని ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్కసాగర్ నుంచి నాగార్జునసాగర్‌కు అనుసంధానం చే యడం వల్ల తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు నీరు అందించే అవకాశం ఉంది. కఅష్ణా నదిపై ఆధార పడిన ప్రాజెక్టులకు గోదావరి నీటిని తీసుకురావడం ద్వారా నీటి భద్రత పెరుగుతుంది (ప్రస్తుతం దీని మార్గంపై ఏపీతో భేదాభిప్రాయాలు ఉన్నాయి). కర్ణాటకలోని మలప్రభ సబ్–బేసిన్ అవసరాలకు నీరు అందుతుంది. గోదావరిలో నిజంగా అంత మిగులు జలాలు ఉన్నాయా అనే అంశంపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేదు. పోలవరం నుంచి కావేరి వరకు నీటిని తర లించాలని ఏపీ, ఇచ్ఛంపల్లి నుంచి తరలించాలని తెలంగాణ పట్టుబడుతున్నాయి. కేంద్రం ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో ముందుకు పోవడంలేదు. ఈ ప్రాజెక్టు వల్ల కఅష్ణా నదిలో తమకు రావాల్సిన వాటా తగ్గి పోతుందని తెలంగాణ, ప్రాజెక్టు మార్గంపై ఆంధ్రప్రదేశ్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి.

## ఏపీ ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ రూట్

కేంద్ర ప్రభుత్వ జాతీయ జల అభివఅద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడీఏ) రూపొందించిన అసలు ప్రణాళిక ప్రకారం లింక్ రోడ్డు గోదావరి (ఇచ్ఛంపల్లి/సమ్మక్క సాగర్)– కఅష్ణా (నాగార్జున సాగర్)–పె న్నా (సోమశిల)–కావేరి (గ్రాండ్ ఆనికట్) గా ఉంది. కానీ, ఈ మార్గానికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని ప్రతిపాదిస్తోంది. దీని ప్రకారం గోదావరి నది (పోలవ రం ప్రాజెక్ట్) కుడికాల్వ నుంచి ప్రకాశం బ్యారేజ్ విజయవాడ మారుతీపురం, అక్కడినుంచి ఎత్తి పోతల/ కాల్వ వ్యవస్థ ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ (శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ), అక్కడి నుంచి నాగార్జునసాగర్ టైల్ ఎండ్ పాండ్/ సోమశిల (పెన్నాబేసిన్), అక్కడినుంచి కావేరి నది (తమిళనాడు). అంటే ఇచ్ఛంపల్లి వద్ద కాకుండా పోలవరం ప్రాజెక్ట్ కుడి కాల్వ ద్వారా వచ్చే మిగులు జలాలను ఉపయోగించుకోవాలని ఏపీ కోరు తోంది. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ ఎగువన ఉన్న మారుతీపురం లేదా పోలవరం కాల్వల ద్వారా నీటిని కఅష్ణా బేసిన్‌లోని బనకచర్ల క్రా స్ రెగ్యులేట ర్‌కు తరలించి, అక్కడ నుండి సోమశిల (పెన్నా) మీదుగా కావేరికి పంపాలనేది ఏపీ ప్లాన్. ఈ మార్గంలో వెళ్లడం వల్ల ఇప్పటికే ఉన్న కాల్వల వ్యవస్థలను కొంతవరకు వాడుకోవచ్చని, దీనివల్ల కొత్తగా భూసేకరణ సమస్యలు మరియు ప్రాజెక్టు అంచనా వ్యయం తగ్గుతుందని ఏపీ వాదన. అయితే ఈ ప్రత్యా మ్నాయ మార్గం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ భూభాగం మీదుగానే సాగుతుంది. దీనివల్ల గోదావరి మిగులు జలాల ప్రయోజనం మొత్తం ఏపీ, తమిళనాడులకే ద క్కుతుందని, భౌగోళికంగా ఎగువన ఉన్న తెలంగాణకు చుక్క నీరు కూడా లభించకుండా తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ వాదిస్తోంది.

## తెలంగాణకు నష్టం

గోదావరి – కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి నీటి హక్కుల న ష్టం, ఆయకట్టు ఎండిపోవడం, మరియు పర్యావరణ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వం మరియు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా (ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం 968 టీఎంసీ) ఇంకా పూర్తిగా తేలలే దు. ఇలాంటి స్థితిలో మిగులు జలాల పేరుతో నీటిని కావేరికి తరలిస్తే, భవిష్యత్తు లో తెలంగాణతన హక్కులను శాశ్వతంగా కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.గోదావరి నీటిని కఅష్ణా బేసిన్‌కు మళ్లించినప్పుడు, అంతర్ రాష్ట్ర ఒప్పందాల ప్రకారం తెలంగాణకు కఅష్ణా జలా ల్లో అదనంగా లభిం చాల్సిన 45 టీఎంసీల వాటాను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్క సాగర్ వద్ద నుండి నీటిని మళ్లిస్తే, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజ్, దేవాదుల, సీతమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడుతుంది. తెలంగాణలోని మెట్ట ప్రాంతాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. సమ్మక్క సాగర్ బ్యారేజ్‌కు కేవలం 24 కి.మీ ఎగువన మరో భారీ మళ్లింపు ప్రాజెక్టు కట్టడం వల్ల వరదల సమయంలో నీటి నిర్వహణ చాలా కష్టమవుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ లింక్‌ను పోలవరం – బనకచర్ల – నాగార్జునసాగర్ మీదుగా (తెలంగాణ భూభాగాన్ని దాదాపు దాటవేస్తూ) నిర్మించాలని ప్రతిపాదిస్తోంది. ఈ మార్గం వల్ల తెలంగాణకు చుక్క నీరు కూడా దక్కకుండా పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీనికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి నిరసన తెలపడమే కాకుండా అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. ఇచ్ఛంపల్లి వద్ద పూర్తి స్థాయి డ్యామ్ నిర్మిస్తే ఛత్తీస్‌గఢ్‌తో పాటు తెలంగాణలోని అటవీ ప్రాంతాలు, గ్రామాలు ముంపునకు గురవుతాయి. (అందుకే తెలంగాణ ఈ డ్యామ్ ఎత్తు తగ్గించాలని డిమాండ్ చే స్తోంది). లింక్ ప్రాజెక్టు ద్వారా తరలించే నీటిలో 50% వాటా తమకే దక్కాలని తెలంగాణ డి మాండ్ చేస్తోంది. ఈ కాల్వల మార్గం కచ్చితంగా తెలంగాణ భూభాగం (ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్క సాగర్) నుంచే సాగాలి.నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలైన మునుగోడు, చండూరు వంటి మెట్ట ప్రాంతాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగు, తాగు నీరు అందించాలని తెలంగాణ ప ట్టుపడుతోంది.

## కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ అభ్యంతరాలు

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు మరియు జాతీయ జల అభివఅద్ధి సంస్థ (ఎన్ డబ్ల్యుడీఏ) కు అధికారికంగా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్న పోలవరం – నాగార్జున సాగర్ – సోమశిల – కావేరి ప్రత్యామ్నాయ మార్గాన్ని తెలంగాణ పూర్తిగా తిరస్కరించింది. ఈ రూట్ ద్వారా నీటిని మళ్లిస్తే తెలంగాణకు చుక్క నీరు కూడా రాకుండా పూర్తిగా బైపాస్ అవుతుందని స్పష్టం చేసింది.ఏపీ ప్రభుత్వం తలపెట్టిన వివాదాస్పద 'గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్ట్' సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ను కేంద్రం పరిశీలించడాన్ని తెలంగాణ తప్పుబట్టింది. ఇది 1980 గోదావరి జ లాల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యుడీటీ) అవార్డును, మరియు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ను స్పష్టంగా ఉల్లంఘిస్తోందని లేఖలో పేర్కొంది. ఏదైనా నదుల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని తరలిస్తే, అందులో కనీసం 50% వాటా నీటిని తెలంగాణ అవసరాలకే కే టాయించాలని, అలాగే ఆ మార్గం ఇచ్ఛంపల్లి లేదా సమ్మక్క సాగర్ నుంచే వెళ్లాలని డిమాండ్ చేస్తోంది.

## కేంద్రం, నదీజలాల బోర్డుల తాజా నిర్ణయాలు (2025–26)

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం, బోర్డులు ఇటీవలి కాలంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ ఏడాది జనవరిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కఅష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం మరియు ఇతర వివాదాలను సాంకేతిక కోణంలో పరిష్కరించడానికి కేంద్ర జలశక్తి శాఖ ఒక 13 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయిటెక్నికల్ కమిటీని నియమించింది. ఇందులో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యుసీ) చైర్మన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా, కేఆర్ ఎంబీ, జీఆర్ ఎంబీ చైర్మన్లు, అలాగే ఇరు రాష్ట్రాల నుండి న లుగురేసి ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య కఅష్ణా జలాల పున్ణపంపిణీ మరియు అదనపు నిబంధనలపై తుది నివేదిక సమర్పించడానికి కఅష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ గడువును కేంద్రం 31 జూలై 2026 వరకు పొడిగించింది. 2025–26 నీటి సంవత్సరానికి గాను కఅష్ణానది నీటి వినియో గంలో తెలంగాణ తన వాటా కంటే తక్కువ నీటిని (కేవలం 26% లోపు) వాడుకుందని రాష్ట్ర సాగునీటి శాఖ రికార్డులను కేఆర్ ఎంబీ (కఅష్ణా నదీ యాజమాన్య బోర్డు) ముందు ఉంచింది. తెలంగాణలోని పాలమూరు–రంగారెడ్డి, సీతారామ సాగర్, మరియు సమ్మక్క–సారక్క వంటి పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం నుండి త్వరగా అనుమతులు మరియు నిధులు మంజూరు చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ

ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన వివాదాస్పద పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ (పీబీఎల్‌బీ / పీఎల్ ఎన్‌బీ) ను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ (డబ్ల్యు.పి.నెం. 1258 ఆఫ్ 2025) దాఖలు చేసింది. పోలవరం ప్రాజెక్ట్ నుండి కఅష్ణా డెల్టాకు 80 టీఎంసీల వరద నీటిని మళ్లించడానికి మాత్రమే గతంలో అనుమతులు ఉన్నాయి. అయితే, ఏపీ ప్రభుత్వం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యుసీ) అనుమతులు లేకుండానే ఈ మళ్లింపు సామర్థ్యాన్ని 200 నుండి 300 టీఎంసీలకు పెంచేలా టెండర్లు పిలవడాన్ని తెలంగాణ సుప్రీంకోర్టు దఅష్టికి తీసుకెళ్లింది. గోదావరి జలాల వివాదాల ట్రిబ్యునల్ (జీడబ్ల్యుడీటీ) అవార్డు ప్రకారం తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల న్యాయమైన వాటాకు ఈ విస్తరణల వల్ల తీవ్ర నష్టం వాటి ల్లుతుందని తెలంగాణ వాదించింది. దీనివల్ల తెలంగాణలోని భావి సాగునీటి ప్రాజెక్టులకు నీటి కొరత ఏర్పడుతుందని పేర్కొంది. పోలవరం ప్రాజెక్ట్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని కూడా తెలంగాణ గట్టిగా వ్యతిరేకించింది. కోర్టు సూచనల మేరకు, ఈ అంతర్రాష్ట్ర జల వివాదంపై రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసేందుకు తెలంగాణ సిద్ధమైంది.

## తమిళనాడు వాదన

గోదావరిలో మిగులు జలాలు లేవన్న తెలంగాణ, ఏపీల వాదనను తమిళనాడు తోసిపుచ్చుతోంది. ప్రతి ఏటా వందల టీఎంసీల గోదావరి వరద నీరు వఅధాగా సముద్రంలో కలుస్తోందని, ఆ నీటిని మళ్లించడం వల్ల ఏ రాష్ట్రానికి నష్టం జరగదని తమిళనాడు గట్టిగా వాదిస్తోంది.గోదావరి –కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై తమిళనాడు రాష్ట్రం అత్యంత అనుకూలమైన మరియు దూకుడుగా ఉన్న వైఖరిని ప్రదర్శిస్తోంది. కావేరి నదీ బేసిన్‌లో తరచూ ఏర్పడే నీటి ఎద్దడిని అధిగమించడానికి ఈ ప్రాజెక్టును ఒక ఏకైక శాశ్వత పరిష్కారంగా తమిళనాడు భావిస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ మరియు జాతీయ జల అభివఅద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడీఏ) లపై ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాలని నిరంతరం ఒత్తిడి తెస్తోంది. ఈ ప్రాజెక్టుకు 'జాతీయ ప్రాజెక్ట్' హోదా కల్పించి, నిర్మాణ వ్యయంలో 90% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలని తమిళనాడు డిమాండ్ చేస్తోంది. కేంద్రం రూపొందించిన అసలు నివేదిక ప్రకారం తమిళనాడుకు సుమారు 41 టీఎంసీల నీరు లభిస్తుంది. కానీ, తమ రాష్ట్రంలోని కావేరి డెల్టా వ్యవసాయ అవసరాలు మరియు చెన్నై తాగునీటి అవసరాల దఅష్ట్యా తమకు కనీసం 80 నుండి 100 టీఎంసీల నీటిని కేటాయించాలని తమిళనాడు పట్టుబడుతోంది. కర్ణాటకతో ఉన్న కావేరి జల వివాదాల వల్ల తమిళనాడులోని తంజావూరు వంటి డెల్టా ప్రాంతాలు తరచూ కరవు బారిన పడుతున్నాయి. గోదావరి నీరు వస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆ రాష్ట్ర నమ్మకం. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) మధ్య రూట్ మ్యాప్ మరియు మిగులు జలాలపై వివాదాలు ఉన్నందున ప్రాజెక్ట్ ఆలస్యం అవుతోందని తమిళనాడు ఆందోళన చెందుతోంది. అందుకే, మొత్తం ప్రాజెక్ట్ ఒకేసారి కాకుండా, కఅష్ణా (నాగార్జున సాగర్)–పెన్నా (సోమశిల)–కావేరి (గ్రాండ్ ఆనికట్) లింక్‌ను మొదటి దశలో పూర్తి చేయాలని, ఆ తర్వాత గోదావరి అనుసంధానాన్ని చూడవచ్చని తమిళనాడు కేంద్రానికి ప్రత్యా మ్నాయ ప్రతిపాదనలు చేసింది.

## తమిళనాడు–కర్ణాటక విభేదాలు

కావేరి జలాల పంపిణీపై తమిళనాడు, కర్ణాటకల మధ్య దశాబ్దాలుగా తీవ్ర వివాదం నడుస్తోంది. ఈ అనుసంధాన ప్రాజెక్ట్ ఆ వివాదాన్ని మరింత పెంచేలా మారింది. సాధారణంగా వర్షాలు లేని సమయంలో కర్ణాటక తమకు కావేరి ట్రిబ్యునల్ (సీడబ్ల్యుడీటీ),సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకా రం నీటిని విడుదల చేయడం లేదని తమిళనాడు ఆరోపిస్తోంది. అందువల్ల గోదావరి అనుసం ధాన నీరు వస్తే, కర్ణాటక తనపై ఉన్న బాధ్యతను తగ్గించుకుని, తమిళనాడుకు ఇవ్వాల్సిన సహజ కావేరి జలాల వాటాను మరింత తగ్గించే ప్రమాదం ఉందనే ఆందోళన తమిళనాడుకు ఉంది. కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం 'మేకదాటు' వద్ద కొత్త డ్యామ్ నిర్మించాలని చూస్తోంది. దీనిని తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్రం గోదావరి–కావేరి లింక్ ప్రాజెక్టును చూపిస్తూ, కర్ణాటక మేకదాటు ప్రాజెక్టుకు అనుమతులు ఇస్తుందేమోననే భయం తమిళనాడుకు ఉంది. గోదావరి నీరు కావేరి బేసిన్‌కు వస్తే, ఎగువ రాష్ట్రంగా ఉన్న తమకు కూడా ఆ నీటిలో సమాన వాటా దక్కాలని కర్ణాటక పట్టుబడుతోంది. కానీ, నీరంతా తమిళనాడులోని గ్రాండ్ ఆనికట్‌కే వెళ్లే లా ప్రణాళిక ఉండటంపై కర్ణాటక అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## తమిళనాడుకు కేంద్రం హామీలు

తమిళనాడు ప్రభుత్వం నిరంతరం చేస్తున్న ఒత్తిడి, ప్రదర్శిస్తున్న అనుకూల వైఖరి దఅష్ట్యా కేంద్ర జలశక్తి శాఖ ఆ రాష్ట్రానికి కొన్ని స్పష్టమైన హామీలను ఇచ్చింది.తెలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) మధ్య గోదావరి మిగులు జలాలపై ఏకాభిప్రాయం కుదరడం ఆలస్యమవుతున్నందున, తమిళనాడుకు మేలు చేసేలా మొదటి దశలోనే కఅష్ణా (నాగార్జున సాగర్)–పెన్నా (సోమశి ల) – కావేరి (గ్రాండ్ ఆనికట్) పనులను ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టేందుకు కేంద్రం సాను కూలత వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టుకు భారీగా ఖర్చవుతున్నందున, దీనిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. దీనివల్ల నిర్మాణ వ్యయంలో సింహభాగాన్ని (సుమారు 60% నుండి 90%) కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, తమిళనాడుపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని హామీ ఇచ్చింది.తమిళనాడుకు చేరే నీటి పరిమాణం తగ్గకుండా ఉండేందుకు, మార్గమధ్యంలో నీటి ఆవిరి మరియు దొంగతనాలను అరికట్టేలా అత్యాధునిక ప్రెజర్ పైప్‌లైన్ సాంకేతికతను ఈ ప్రాజెక్టులో గరిష్ఠంగా ఉపయోగిస్తామని కేంద్రం స్పష్టం చేసింది.




# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక





గురువారం 11-06-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 66 రూ॥ 6.00


# 22వ వసంతపు తోరణం

## చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ **"22 వ వసంతం"** లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## "నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో

**మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....**



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

**వసంతాల అక్షరోద్యమం**



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

**Corporate Office Address :**

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034



నిఖార్సయిన వార్తల నిజరూపం

22ND ANNIVERSARY 2004-2026

# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



గురువారం 11-06-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 66 రూ॥ 6.00


# పాపం మీనాక్షి..పదవి చే జారింది!?

## కోవర్టులెవరు! కొంప ముంచిందెవరు!?



- మీనాక్షికి తెలియని కేసు బిజెపికి పంపిందెవరు?
- పాపం మీనాక్షి పదవి చేజారింది?
- కాంగ్రెస్ లో కుంపటి రగిలింది?
- ఆ పని ఎవరు చేసింది.. ఎవరు ఉప్పందించింది!
- మధ్యప్రదేశ్ మంత్రి చెప్పకనే చెప్పిందెవరి గురించి!














- తెలంగాణ లో కేసు గురించి.. ఎవరు పక్కా సమాచారం అందించించి!
- ఇంచార్జి గా వస్తే భవిష్యత్తు ఆగమైంది!
- రాజ్య సభలో అడుగు పెట్టకుండా పోయింది!
- తెలంగాణ కోసం పని చేస్తే, సొంత రాష్ట్రంలో పదవి గండమొచ్చింది!

రేపటి మీ నేటిధాత్రిలో



## మోదీ సరికొత్త చరిత్ర

### ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించిన నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

భారత ప్రధానిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటూ చారిత్రక మైలురాయిని చేరుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా అత్యధిక కాలం నిరంతరాయంగా పదవిలో కొనసాగిన నాయకుడిగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించారు. 2014 మే 26న ప్రధాని బాధ్యతలు చేపట్టిన మోదీ, బుధవారంతో 4,399 రోజులు పూర్తి చేసుకుని కొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నారు.

నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు 4,398 రోజులపాటు ఎన్నికైన ప్రధానిగా కొనసాగగా, మోదీ ఆ రికార్డును అధిగమించారు. ప్రస్తుతం వరుసగా మూడోసారి ప్రధానిగా కొనసాగుతున్న మోదీ భారత రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించారు.

**రాష్ట్రపతి ముర్ము అభినందనలు**

ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. దేశ ప్రజలకు ఆయన నాయకత్వంపై ఉన్న అచంచల విశ్వాసానికి ఈ మైలురాయి నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరేలా మోదీ ప్రభుత్వం పనిచేసిందని ప్రశంసించారు.

**ప్రపంచ నేతల ప్రశంసలు**

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అమెరికా ప్రతినిధులు సహా పలువురు అంతర్జాతీయ నేతలు మోదీకి అభినందనలు తెలిపారు.

**జార్జియా మెలోనీ:**

"భారత చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి అభినందనలు. భారత్–ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడాలని ఆకాంక్షిస్తున్నాను."

**అన్వర్ ఇబ్రహీం:**

"భారత్ అభివృద్ధి, ప్రపంచ వేదికపై దాని ప్రతిష్ఠను పెంచడంలో మోదీ కృషి విశేషం."

**చంద్రబాబు, లోకేశ్ శుభాకాంక్షలు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. "కొంతమంది నాయకులు దేశాన్ని పాలిస్తారు... కానీ కొద్దిమంది మాత్రమే దేశ గమనాన్ని మార్చగలరు. మోదీ నాయకత్వం భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

**మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ...**

"నెహ్రూ రికార్డును అధిగమించడం అనితరసాధ్యం. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అజేయ శక్తిగా ఎదిగింది" అని కొనియాడారు.

**బండి సంజయ్ స్పందన**

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... "అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారు. ప్రపంచ వేదికపై భారత కీర్తిని పెంచిన నాయకుడు మోదీ" అని పేర్కొన్నారు.

**రామచందర్‌రావు వ్యాఖ్య**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ... "4,399 రోజులు భారత చరిత్రలో స్వర్ణయుగానికి నాంది పలికాయి. సంక్షేమం, మౌలిక సదుపాయాలు, డిజిటల్ విప్లవం, జాతీయ భద్రత రంగాల్లో దేశం కొత్త ఎత్తులకు చేరింది" అని అన్నారు.

## ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు



హైదరాబాద్, నేటిధాత్రి:

ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. ఈరోజు(బుధవారం) భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు.

ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా? అని ప్రశ్నించారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సీఎం రేవంత్‌కు ఓటమి తప్పదు: ఎంపీ అర్వింద్



భువనగిరి, నేటిధాత్రి:

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డికి ఘోర ఓటమి తప్పదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి చదువు రాదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం భువనగిరిలో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌పై ఈ రాష్ట్రంలో కేసు ఉన్నట్లు ఎన్నికల సంఘానికి ఎలా తెలిసిందంటూ సందేహం వ్యక్తం చేశారు.

ఇది రేవంత్ రెడ్డి కుట్రో, కాంగ్రెస్ పార్టీ కుట్రో వాళ్లే తెలుసుకోవాల్సి ఉందని బీజేపీ ఎంపీ అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు ఉండడం సహజమన్నారు. నరేంద్రమోదీ చరిష్మాను ఓట్లుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ విఫలమైందని విమర్శించారు. అక్రమ ఇసుక రవాణాకు లారీలు దొరుకుతున్నాయి.. కానీ ధాన్యం రవాణాకు దొరకడం లేదా? అంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో బీజేపీ విజయం సాధించడం సులభమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి 32 లక్షల టన్నుల బియ్యం బకాయిగా ఉందని చెప్పారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్షం లేదన్నారు. కానీ నేడు చాలా ప్రతిపక్షాలు ఉన్న సమయంలో 12 ఏళ్ల పాటు మోదీ ప్రధానిగా ఉన్నారని ఎంపీ అర్వింద్ వివరించారు.

## ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకుని కుట్ర!

- మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై చామల ఆగ్రహం
- కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకే బీజేపీ వ్యూహం అమలు చేసిందని ఆరోపణ

హైదరాబాద్, నేటిధాత్రి:

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఈ వ్యవహారంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, ఇది రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించారు.

బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఒక ప్రైవేట్ కేసును సాకుగా చూపించి కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని విమర్శించారు. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 230 ప్రకారం ఫామ్–26 సమర్పించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ సాంకేతిక కారణాలను చూపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని ఎన్నికల బరిలో



నుంచి తప్పించారని ఆరోపించారు.

మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ స్థానాలు, కాంగ్రెస్‌కు ఒక స్థానం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు రంగంలోకి దించిందని చామల ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు దక్కాల్సిన స్థానాన్ని దూరం చేయడమే లక్ష్యంగా ముందస్తు ప్రణాళికతో బీజేపీ వ్యవహరించిందని అన్నారు.

ఈడీ, సీబీఐ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు పొందుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా అధికార పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకే విధమైన రాజకీయ లక్ష్యంతో పనిచేస్తున్నాయని, కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు.

దేశ ప్రజలు బీజేపీ కుటిల రాజకీయాలను గమనించాలని కోరిన చామల, చిల్లర రాజకీయాలతో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేరని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటాన్ని కాంగ్రెస్ మరింత బలంగా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



## సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష!

- మీనాక్షి నామినేషన్ రద్దుతో బీజేపీకి అనూహ్య లాభం
- తెలంగాణ కాంగ్రెస్ నేతలే సమాచారం ఇచ్చారని బీజేపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

భోపాల్/హైదరాబాద్, నేటిధాత్రి:

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో రాష్ట్రంలో బీజేపీకి అనూహ్య రాజకీయ లాభం చేకూరింది. మూడు రాజ్యసభ స్థానాల కోసం జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశలు దాదాపు ముగియగా, బీజేపీ మూడు స్థానాలను కైవసం చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

మీనాక్షి నటరాజన్ నామినేషన్‌లో లోపాలున్నాయని, తెలంగాణలో నమోదైన ఒక పెండింగ్ కేసు వివరాలను వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల అధికారులు ఆ అభ్యంతరాలను సమర్థించడంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో బీజేపీ మూడో అభ్యర్థి మహేశ్ కేవత్‌కు విజయం దాదాపు ఖాయమైంది.

**మహేశ్ కేవత్ ఎవరు?**

మహేశ్ కేవత్ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సుదీర్ఘ అనుబంధం కలిగిన సీనియర్ నాయకుడు. చిన్ననాటి నుంచే సంఘ్ పరివార్ కార్యకలాపాల్లో పాల్గొన్న ఆయన, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, బీజేపీ యువజన విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ బోర్డు చైర్మన్‌గా కూడా సేవలందించారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మాట్లాడుతూ, కేవత్ నామినేషన్ సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**తెలంగాణ కాంగ్రెస్ నుంచే సమాచారం వచ్చింది: కైలాష్ విజయవర్గీయ**

ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కైలాష్ విజయవర్గీయ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు రేపాయి. "మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసు ఉందన్న విషయం మాకు ముందుగా తెలియదు. తెలంగాణ కాంగ్రెస్ నాయకుల నుంచే ఆ సమాచారం వచ్చింది. కేసుకు సంబంధించిన పత్రాలు కూడా అక్కడి నుంచే అందాయి" అని ఆయన మీడియాతో పేర్కొన్నారు. "తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆ పార్టీ నేతలే సమాచారం ఇవ్వడం కాంగ్రెస్ అంతర్గత పరిస్థితిని వెల్లడిస్తోంది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. కొందరు నేతలు కోవర్ట్ రాజకీయాలు నడిపి పార్టీకి నష్టం చేస్తున్నారన్న చర్చకు మరింత ఊతమిచ్చాయి.

# పోగొట్టుకున్న మొబైల్ బాధితుడికి అందజేసిన ఎస్సై.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను విజయవంతంగా రికవరీ చేసి బాధితుడికి అందజేయడం జరిగింది. చిట్యాల గ్రామానికి చెందిన సురేందర్ అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని, రికవరీ చేయాల్సిందిగా చిట్యాల పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు సమర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆదేశాల ప్రకారం, చిట్యాల పోలీస్ స్టేషన్ సిబ్బంది కేంద్ర ప్రభుత్వ సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో చిట్యాల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ లాల్ సింగ్ నిరంతరం సాంకేతిక నిఘా ఉంచి, సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా సదరు మొబైల్ ఫోన్ యొక్క ఖచ్చితమైన సమాచారాన్ని, లొకేషన్‌ను గుర్తించారు. ట్రేస్ చేసిన మొబైల్ ఫోన్‌ను పోలీస్ సిబ్బంది విజయవంతంగా రికవరీ చేశారు. నేడు రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌ను చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ పోచంపల్లి సతీష్ బాధితుడైన సురేందర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, ఆయన సమక్షంలో భద్రంగా అందజేశారు. పోగొట్టుకున్న తన విలువైన మొబైల్ ఫోన్‌ను అతి తక్కువ సమయంలోనే ట్రేస్ చేసి అప్పగించినందుకు బాధితుడు సురేందర్ కానిస్టేబుల్ లాల్ సింగ్ మరియు ఎస్ఐ సతీష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి కార్యకర్తలు



**కథలాపూర్, నేటిధాత్రి:** భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు అత్యధిక కాలం ప్రధానమంత్రిగా సేవలందించిన సందర్భంగా,భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చన కార్యక్రమం నిర్వహించి వారికి ఆయురారోగ్యాలతో ఉండి భారత దేశాన్ని శక్తివంతంగా నిలపాలని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, సీనియర్ నాయకులు బద్ది సత్యం,గాండ్ల శ్రీనివాస్,బండ అంజయ్య,కాసోజి ప్రతాప్,గుండేటి రాజేష్,వీరమల్ల శ్రీనివాస్,ముంజ వెంకటేష్,చందనగిరి రాజేష్,కంటే రాజం,సాయిరెడ్డి,నరేష్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రతి ఇంటా మొక్క నాటి భావితరాలకు పచ్చని భవిష్యత్తు అందించాలి...ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్...

**నర్సంపేట, నేటిధాత్రి:** పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం విస్తృతంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ భాస్కర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్క అయినా నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా అవి వృక్షాలుగా ఎదిగే వరకు దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. పర్యావరణానికి ముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని, పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.



నర్సంపేట పట్టణాన్ని మరింత పచ్చదనంతో, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం అన్ని విధాలుగా కృషి చేస్తోందని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి భూమిని రక్షించుకోవడానికి వృక్ష సంపదే ప్రధాన ఆధారమని ఆమె పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రిహాబిలిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం ఆసుపత్రుల ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలు, రిహాబిలిటేషన్ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఎసిపి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ భావితరాలకు అందించే గొప్ప ఆస్తి పచ్చని పర్యావరణమేనని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామని, ప్రజలు తమ ఇంటి ఆవరణలో స్థలం ఉన్న చోట తప్పనిసరిగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, టౌన్ ఎస్సై గూడ అరుణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు కాంపెల్లి వీణ విజేందర్ రెడ్డి, పొన్నాల మనీషా ప్రకాష్, దొంగల రజిత, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభలు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్.



**కల్వకుర్తి, నేటిధాత్రి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కల్వకుర్తి మున్సిపాలిటీలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ 19,20,21,22 వార్డులలో పర్యటించి వారి సమస్యలను తెలుసుకున్నారు వార్డులలోని ప్రజలు పలు సమస్యల మీద దరఖాస్తు పేపర్లు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,కౌన్సిలర్లు చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి, మబ్బు రామరాజు, కొల్లోజు రాజేష్,చిత్తారి ఎల్లమ్మ,శీను, కోడెల లలిత,గణేష్, యాదవ్,ఎజాస్,మక్బుల్,మాజీ కౌన్సిలర్ నేరటి చిన్న,నాయకులు సోఫి,వెంకట్ రెడ్డి,ఈశ్వర్, రేష్మ, శివ,రెహానా,దున్న సురేష్, మున్సిపల్ అధికారులు వార్డుల ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో హనుమాన్ గుడిలో పూజలు.



మోడీ పాలన 12 సం. పూర్తి సందర్భంగా.....

**చిట్యాల, నేటిధాత్రి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని బుధవారం రోజున చిట్యాల మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ఆయన పేరు మీద పూజ చేయడం జరిగిందని బిజెపి చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు, ఆయన మాట్లాడతూ 12 సంవత్సరాల మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను పేద మధ్యతరగతి ప్రజల కోసం తీసుకువచ్చి మన యొక్క భారతదేశయాన్ని ప్రపంచ దేశాల్లో ప్రథమ స్థాయిగా నిలిపిన ఘనత మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆయన ఇంకా ఇలాంటి సంక్షేమ పథకాలు మరిన్ని ప్రజలకు లిఅందజేయాలని ఇంకసేవ చేయాలని ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ ఆ హనుమంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఆయనకు ఉండాలని కోరుకున్నామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్ రాయిని శ్రీనివాస్ వల్లల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు పటిష్ట చర్యలు.



గంజాయి రహిత సమాజం కోసమే ఈగల్ బృందం... ఆర్కేపి ఎస్సై జె శ్రీధర్....

**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట నిఘా, కఠిన ,చట్టపరమైన చర్యలను వేగవంతం చేసిందని, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేకంగా 'ఈగిల్' వంటి వింగ్స్‌ను ఏర్పాటు చేశాయని అందులో భాగంగానే రామకృష్ణాపూర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జె శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై జె శ్రీధర్ మాట్లాడారు. రామగుండం సిపి, మంచిర్యాల డిసిసి, బెల్లంపల్లి ఏసిపి ల ఆదేశాల



మేరకు రామకృష్ణాపూర్ పట్టణంలో ముందస్తు సమాచారం ఆధారంగా అనుమానితుల ఇళ్లలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గంజాయి సేవించడం, విక్రయించడం వంటి కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గంజాయి రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ బృందం నిరంతరం నిఘా ఉంచుతోందని తెలిపారు. గంజాయి సంబంధిత సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ 4,399 రోజుల పాలన పూర్తి సందర్భంగా ప్రత్యేక పూజలు



**నర్సంపేట, నేటిధాత్రి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 4,399 రోజులపాటు నిరంతరాయంగా పదవిలో కొనసాగి దేశ చరిత్రలో ఎన్నికైన ప్రధానమంత్రుల్లో అత్యధిక కాలం సేవలందించిన నాయకుడిగా నిలిచిన సందర్భంగా నర్సంపేటలో బీజేపీ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆధ్వర్యంలో మాదన్నపేట కట్టపై ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాని మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో దేశానికి మరింత సేవ చేయాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా గూడూరు సందీప్ మాట్లాడుతూ.. 2014 నుంచి ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై తన స్థానాన్ని మరింత బలపరుచుకుందని అన్నారు. దేశాన్ని ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడంలో, పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' నినాదంతో కోట్లాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. జీ-20 సదస్సు నిర్వహణ, వాక్సిన్ మైత్రి కార్యక్రమం, అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పారని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు మోదీ నాయకత్వం దేశానికి అవసరమని పేర్కొంటూ ప్రధానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, ముత్యాల శ్రీనివాస్, చిలువేరు అన్వేష్, తప్పెట్ల సతీష్, తరుణ్ సాయి, రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల మహాసభను విజయవంతం చేయండి

పివైఎల్ మండల అధ్యక్ష, కార్యదర్శి తాటి రమేష్, కల్తి ప్రమోద్



**గుండాల, నేటిధాత్రి:** ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ గుండాల మండల 6వ మహాసభ మండలంలోని ముత్తాపురం గ్రామంలో 13వ తేదీన జరుగుతుందని ఈ మహా సభకు యువతి,యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ గుండాల మండల అధ్యక్ష ,కార్యదర్శులు తాటి రవేష్, కల్తి ప్రవోదు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతిశీల యువజన సంఘం ఏర్పడి రెండున్నర దశాబ్దాలు అవుతుందని ఈ కాలంలో యువతి, యువకులను కూడగట్టి రాష్ట్రంలో గుట్కా, మద్యంని రాష్ట్రంలో నిషేధించాలని,నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అనేక ఉద్యమాలు నిర్వహించిందని అన్నారు. యువకులను యువజన ఉద్యమాలలోకి సమీకరిస్తున్న సమయంలో పాలకవర్గాలు, మతోన్మాదులు,రౌడీలు, గుండాల దాడులలో పగడాల వెంకన్న ,తుడుం రామన్న, కత్తిరమల్ల పోచన్న, వేములపల్లి కిరణ్ కుమార్, రామదాస్ పున్నయ్య, శంకరన్న లాంటి అనేకమంది అమరులయ్యారన్నారు. వీరి త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్తు కర్తవ్యాలను ఈ మహాసభ సందర్భంగా రూపొందించుకొని పోరాడుతామన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో విద్యార్థి ,యువకులకు అనేక వాగ్దానాలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనాయని అన్నారు. ఈ పాలకవర్గ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడం కొరకు యువకులు ఈ మహాసభకు హాజరై స్ఫూర్తి పొంది ప్రభుత్వ వ్యతిరేకత విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్....



**నర్సంపేట, నేటిధాత్రి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీ 10వ వార్డులో పోచమ్మ ఆలయం సమీపంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, 10వ వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన



లబ్ధిదారులకు చేరవేసేందుకు వార్డు సభలు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. వార్డులో డ్రైనేజీ, మట్టి రోడ్లు, మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని, వార్డు అభివృద్ధికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే 10వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తానని కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ తెలిపారు. అనంతరం వార్డు ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల కోసం వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనీషా, 8వ వార్డు కౌన్సిలర్ దొంగల రజిత, 10వ వార్డు ఆఫీసర్ సిద్ధార్థ్, ఆర్పీ సువర్ణ, వార్డు సభ్యులు అరెపెల్లి బాబు, లక్కరాజు, ఆవుల శ్రీకాంత్, మామిడాల సదాలక్ష్మి, ఉదయగిరి సరిత తదితరులు పాల్గొన్నారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# భారతదేశ చరిత్రను తిరగ రాసిన మహనీయుడు నరేంద్ర మోడీ



**కల్వకుర్తి, నేటిధాత్రి:** భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటినుండి ఇప్పటివరకు భారతదేశ ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలంగా 12 ఏళ్లకు పైగా పనిచేసిన ఏకైక ప్రధానమంత్రిగా నరేంద్ర దామోదర్ దాస్ మోడీ నిలిచారు ఇప్పటివరకు ఆరికార్డు స్వర్గీయ నెహ్రూపై ఉన్నది ఈ శుభ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్థానిక బిజెపి నాయకులు నరేంద్ర మోడీ మరింత కాలం ప్రధానమంత్రిగా పనిచేయాలని భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలపాలని భారతదేశాన్ని తిరిగి పూర్వ వైభవం దిశగా నరేంద్ర మోడీ తీసుకెళ్తున్న సందర్భంలో ఆయనకు దీర్ఘాయుష్షు అచంచలమైన శక్తి సామర్థ్యాలను ప్రసాదించాలని కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని వేడుకుని పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్,జిల్లా ఉపాధ్యక్షులు బోడో నరసింహ, కౌన్సిలర్ ఎనుగొండ రామకృష్ణ, సీనియర్ నాయకులు సూర్య కృష్ణ గౌడ్,నరెడ్ల శేఖర్ రెడ్డి, ఏబీవీపీ మల్లేష్ యాదవ్,వాగుల్ దాస్ నరేష్ గౌడ్,బీజేవైఎం జిల్లా నాయకులు ధన్నోజు నరేష్ చారి,పట్టణ ఉపాధ్యక్షులు కొల్లూరి శ్రీధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాపశివ, మర్రిపల్లి సురేష్ యాదవ్,శివ,తదితరులు పాల్గొన్నారు

# ప్రజా - పాలనా - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ముగింపు సభ



**నడికూడ, నేటిధాత్రి:** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా-పాలనా-ప్రగతి ప్రణాళిక 99 రోజుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ,ఎంపీవో గ్రామ సర్పంచ్ కొంగంటి తిరుపతి పాల్గొన్నారు. గ్రామసభలో ప్రజలు పలు సమస్యల గురించి సర్పంచ్ దృష్టికి తీసుకు రాగా వాటిని సర్పంచ్ వెంటనే సంబంధిత అధికారులకు వివరించారు. అందుబాటులో ఉన్న నిధుల ఆధారంగా విడుతల వారీగా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని రోడ్లు,డ్రైనేజీ,నీటి నిల్వలపై ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ప్రాధాన్యత అని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్,వార్డ్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**



# ఆరోగ్య ధాత్రి



## మైండ్ డైట్‌తో జీవనశైలి వ్యాధులకు చెక్

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఆధునిక జీవనశైలితో వ్యాధుల ముప్పు పెరిగిపోతుండటంతో పెద్దసంఖ్యలో ప్రజలు తమ ఆరోగ్య అలవాట్లను (Health Tips) మార్చుకుంటూ కఠిన ఆహార నియమాలు, డైట్ ప్లాన్‌లను అనుసరిస్తున్నారు. కీటో నుంచి డ్యాష్, మైండ్, మెడిటేర్రేనియన్ వంటి ఎన్నో డైట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్కరి ఫిట్‌నెస్ లక్ష్యాలు, ఆరోగ్యపరమైన అంశాల ఆధారంగా ఒక్కో డైట్ ప్లాన్ అనుసరించాల్సి ఉంటుంది. ప్రతి డైట్ ప్లాన్‌కూ ప్రయోజనాలతో పాటు ప్రతికూలతలూ ఉండటంతో పలువరు తరచూ తమ డైట్ ప్లాన్‌లను మార్చుతుంటారు.
ఇక హృద్రోగం నుంచి మధుమేహం, అధిక రక్తపోటు వరకూ పలు వ్యాధులను నివారించడంతో పాటు నియంత్రించే శక్తి కలిగిన డైట్‌గా మైండ్ డైట్ ప్రాచుర్యం పొందుతోంది. మెడిటెర్రేనియన్, డ్యాష్ డైట్లను మేళవిస్తూ కొన్ని మార్పులతో మైండ్ డైట్ ముందుకొచ్చింది. ఈ డైట్ ప్లాన్ ప్రధానంగా మొక్కల ఆధారిత ఆహారంతో డిజైన్ చేయబడింది. ఈ డైట్‌లో జంతు సంబంధ ఆహారాన్ని పరిమితం చేయడం, సంతృప్త కొవ్వులు, అదనపు చక్కెరలతో కూడిన ఆహారానికి దూరంగా ఉండాలి. ఇక మైండ్ డైట్ ప్రధానంగా బరువు తగ్గడంపై కాకుండా గుండె ఆరోగ్యం, మధుమేహం, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై ఫోకస్ చేస్తుంది. నిర్ధిష్ట క్యాన్సర్ల నివారణకు మైండ్ డైట్ ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మైండ్ డైట్‌లో మనం తీసుకునే ఆహారం మితంగా ఉండటంపై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. మైండ్ డైట్‌ను అనుసరించడంతో శరీరంలో వాపు ప్రక్రియను నివారించవచ్చు. ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, మినరల్స్, ఫైటో కెమికల్స్, ఆరోగ్యకర కొవ్వులతో కూడిన ప్లాంట్ బేస్డ్ ఆహారంతో హృద్రోగాల ముప్పు తగ్గుతుంది. కొలెస్ట్రాల్ కూడా తగ్గడంతో పాటు మధుమేహం, ఊబకాయం, రక్తపోటు వంటి సమస్యలు అదుపులోకి వస్తాయి.

## అరటి ఆకుల్లో భోజనం చేస్తే శరీరానికి ఎంత మేలంటే..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
అరటి ఆకుల్లో భోజనం చేయడం భారతీయుల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఆధునిక బిజీ లైఫ్‌లో అరిటాకు భోజనాలు అరుదైనా ఇప్పటికీ పల్లెల్లో, పండుగలు, శుభకార్యాల్లో అరటి ఆకుల్లో భోజనం వడ్డించడం చూస్తుంటాం. అరటి ఆకును ప్లేట్‌లా ఉపయోగిస్తూ ఆహార పదార్ధాలను వడ్డించడం దక్షిణాసియా దేశాల్లోనూ సంప్రదాయంగా వస్తోంది. అరటి ఆకులు సహజసిద్ధమైనవే కాకుండా బయోడీగ్రేడబుల్, విస్తృతంగా అందుబాటులో ఉండటం, పర్యావరణహితమైనవి కావడంతో వీటి వాడకం మేలైనదని నిపుణులు చెబుతున్నారు.
అంతేకాకుండా అరటి ఆకులు వాటర్ ప్రూఫ్ కావడంతో వీటిలో భోజనం చేయడం సౌకర్యవంతంగా ఉంటుంది. అరటి ఆకులో భోజనం చేయడం వంటకాల రుచిని, ఫ్లేవర్‌ను పెంచుతుంది. ఇక అరటి ఆకుల్లో భోజనం చేయడం ద్వారా ప్రయోజనాలను పరిశీలిస్తే అరటి ఆకులు సహజమైన డిస్‌ఇన్ఫెక్టెంట్‌గా చెబుతారు. ఇవి ఆహారంలో ఉన్న హానికారక బ్యాక్టీరియా నశించేలా చేస్తాయి.
అరటి ఆకుల్లో పాలీపెనాల్స్, విటమిన్ ఏ, విటమిన్ సీ వంటి అత్యవసర పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. అరటి ఆకుపై భోజనం వడ్డించగానే



ఆకులోఉండే ఈ పోషకాల్లో కొన్ని ఆహారంలోకి చేరతాయి. కొన్ని సింథటిక్ ప్లేట్లతో పోలిస్తే అరటి ఆకులు ఎలాంటి టాక్సిన్స్‌ను, హానికారక కెమికల్స్‌ను ఆహారంలోకి విడుదల చేయవు. అరటి ఆకుల్లో భోజనం చేయడం ద్వారా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అరటి ఆకుల్లో ఉండే పాలీపెనాల్స్ డైజెస్టివ్ ఎంజైమ్స్‌ను ప్రేరేపించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరిచి పోషకాలను మెరుగ్గా గ్రహించేలా చేస్తాయి.

## పచ్చికొబ్బరి చేసేమేలు తెలుసా..?



పచ్చి కొబ్బరి..! కొంతమంది ఈ పచ్చికొబ్బరిని చాలా ఇష్టంగా తింటారు. అల్పాహారాల్లో వేసుకునే చట్నీగా, తీపి వంటకంగా పచ్చికొబ్బరిని వినియోగిస్తుంటారు. అయితే, కొంతమంది మాత్రం దగ్గు వస్తుందని, బరువు పెరుగుతామని భయంతో ఈ పచ్చి కొబ్బరిని దూరం పెడుతారు. కానీ, నిపుణులు మాత్రం పచ్చి కొబ్బరితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. పచ్చి కొబ్బరిని తరచూ తగిన మోతాదులో తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయంటున్నారు. పచ్చి కొబ్బరి యాంటీ బయోటిక్ గా పని చేస్తుందని, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మ, జుట్టు సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుందని సూచిస్తున్నారు. మరి పచ్చి కొబ్బరితో ఉండే ఆ లాభాలేమిటో ఒకసారి తెలుసుకుందామా..?

### రోగ నిరోధక శక్తి
పచ్చి కొబ్బరిని వీలైనప్పుడల్లా తింటూ ఉంటే శరీంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో శరీరం వైరస్, బ్యాక్టీరియాలతో సమర్ధంగా పోరాడుతుంది. ఇన్‌ఫెక్షన్‌ల బారినపడే ప్రమాదం తప్పుతుంది.

### మంచి కొలెస్ట్రాల్
పచ్చి కొబ్బరిని తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దాంతో రక్తంలో ఎలాంటి మలినాలు ఏర్పడవు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

### జీర్ణ శక్తి
పచ్చి కొబ్బరిలో పీచు పదార్థం (ఫైబర్) ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దాంతో జీర్ణ సమస్యలు కూడా త్వరగా రావు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

### అదుపులో థైరాయిడ్
చాలా మంది థైరాయిడ్ సమస్యతో బాధ పడుతూంటారు. ఇలాంటి వారికి పచ్చి కొబ్బరి బాగా సాయపడుతుంది. పచ్చి కొబ్బరిలో ఉండే పోషకాలు థైరాయిడ్ ను తగ్గిస్తాయి.

### మెదడు ఆరోగ్యం
తరచూ పచ్చి కొబ్బరి తినడం వల్ల మెదడు ఆరోగ్యంగా పని చేస్తుంది. అల్జీమర్స్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

### పిల్లల ఎదుగుదలకు
ఎదిగే పిల్లలకు పచ్చి కొబ్బరి చాలా మేలు చేస్తుంది. పచ్చి కొబ్బరిలో వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దాంతో పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉంటుంది. రక్త హీనత సమస్య తగ్గుతుంది. అలాగే చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు గట్టిపడతాయి. కావాల్సిన శక్తి లభిస్తుంది.

### చర్మం, కేశాల ఆరోగ్యం
పచ్చి కొబ్బరి తరచూ తినడం వల్ల చర్మం, కేశాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతమవుతుంది. వృద్ధాప్య ఛాయలు దరి చేరకుండా ఉంటాయి. జుట్టు రాలడం ఆగిపోతుంది.

## ఉపవాస వేళ ఇలా చేస్తే ఆరోగ్యకరం..!





**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
రోజు ఉపవాసం ఉండే భక్తులు కొన్ని సూచనలు పాటించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉపవాసం ద్వారా శరీరం డీటాక్సిఫికేషన్ అవడంతో పాటు బరువు పెరగకుండా చూసుకోవడం, జీవక్రియల వేగం పెరగడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అయితే ఆరోగ్యపరమైన సమస్యలు దరిచేరకుండా ఉపవాసం చేయడం మేలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పండుగల సమయంలో ఉపవాస వేళ ఎంపిక చేసుకునే ఆహార పదార్ధాల విషయంలో జాగ్రత్త వహించాలి.
ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఉపవాస దీక్షకు ముందు ఉపవాసం ముగిసిన తర్వాత తీసుకోవాలి. ఎనర్జీని రోజంతా కొనసాగించేందుకు బాదం, పనీర్, కర్డ్, నట్స్ వంటివి తీసుకోవాలి. బాదంలో ప్రతి 30 గ్రాముల్లో 6 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇవి ట్రాన్స్‌ఫాట్స్ లేకుండా, ఆరోగ్యకర మోనోఅన్‌శాట్యురేటెడ్ కొవ్వులను కలిగిఉంటాయి. బాదం గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు చర్మం మెరిసేందుకు, మధుమేహ నియంత్రణకు మేలు చేస్తాయి.
ఉపవాసం విరమించే క్రమంలో ముందుగా నీరు తీసుకుని ఆపై తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకర కొవ్వులతో కూడిన సమతులాహారం తీసుకోవాలి. పండుగ వేళ స్వీట్లు అతిగా తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ పెరిగే ముప్పు ఉండటంతో డేట్స్ వంటి సహజమైన స్వీటెనర్స్ తీసుకోవడం మేలు. ఉపవాసం ఉండే సమయంలో శరీ
శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. తగినంత నీరు తరచూ తీసుకోవాలి.

## హెల్ధీ పావ్‌బాజీ ఇలా ట్రై చేయండి..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
పావ్‌బాజీ అంటే పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టంగా తింటారు. అయితే ఇందులో వెన్న అధికంగా వాడటంతో పోషకాహార విలువల పరంగా దీనికి తక్కువ రేటింగ్ ఇస్తారు. దీన్ని తరచూ తింటే బరువు పెరగడం నుంచి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.
అలాగని మన ఫేవరెట్ స్ట్రీట్ ఫుడ్‌ను పూర్తిగా పక్కనపెట్టాల్సిన పనిలేదు. ఎప్పుడైనా ఒకసారి పావ్‌బాజీని ఎంజాయ్ చేయవచ్చు. అయితే ఇంట్లోనే పావ్‌బాజీని తయారుచేసుకుని తీసుకుంటే ఎలాంటి సంకోచం లేకుండా ఎంచక్కా తినేయవచ్చు. రుచితో రాజీపడకుండానే పావ్‌బాజీని ఆరోగ్యకరమైన స్నాక్‌గా మనం ప్రిపేర్ చేసుకోవచ్చు.
స్ట్రీట్‌ఫుడ్‌లో పావ్‌బాజీ తయారీలో అధికంగా నెయ్యి, వెన్న వాడుతుంటారు. వీటిలో ఉండే అనారోగ్యకర కొవ్వులు శరీరానికి హాని చేస్తాయి. మైదాతో దీన్ని చేయడం వల్ల కొలెస్ట్రాల్ పెరగడం, బరువు పెరగడం వంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ టేస్టీ స్నాక్‌గా పావ్‌బాజీని ఇంట్లోనే ఇలా తయారుచేసుకుంటే ఎలాంటి సమస్యలు ఎదురవకుండా ఫేవరెట్ స్నాక్‌ను ఎంజాయ్ చేయవచ్చు.



- వెన్న వాడకాన్ని తగ్గించాలి
- అధికంగా కూరగాయల వాడకం
- మైదా బదులు గోధుమ పిండితో పావ్స్
- ఉప్పు వాడకం తగ్గించాలి
- సలాడ్‌తో కలిపి సర్వ్ చేయాలి

## ఈ ఆహారంతో ఒత్తైన జుట్టు మీ సొంతం

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఆరోగ్యకరమైన ఒత్తైన వెంట్రుకలు కావాలని కోరుకోని వారుండరు. కొందరికి సహజంగా ఒత్తైన జుట్టు వస్తే మరికొందరు అందుకోసం చేయని ప్రయత్నం అంటూ ఉండదు. కేశ సంపద పెంచుకునేందుకు చాలామంది కేశ సంరక్షణ ప్రోడక్ట్స్‌పై పెద్దమొత్తంలో ఖర్చు చేస్తుంటారు.
అయితే కృత్రిమ ప్రోడక్ట్స్‌ను వాడటం కంటే సహజ ఉత్పత్తులు, పదార్ధాలతో ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆహార పదార్ధాలతో మన వెంట్రుకల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. గుడ్ల నుంచి తృణధాన్యాలు, పాలకూర వంటి ఎన్నో ఫుడ్స్ కేశ సంరక్షణకు ఉపయోగపడతాయి. ఎగ్స్ ఆరోగ్యకరమైన కేశ సంపదను సమకూరుస్తాయి. ఎగ్స్‌లో ఉండే విటమిన్ ఏ, ఈ, బయోటిన్, ఫోలెట్ ఒత్తైన జుట్టుతో మెరిసేలా చేస్తాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం, లేదా హెయిర్ మాస్క్‌లా వాటిని అప్లై చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చు. ఒత్తైన కేశాలను పొందాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలాంటే..



- ఎగ్స్
- నట్స్
- పాలకూర
- ఉసిరి
- డైరీ ప్రోడక్ట్స్

## మొక్కల ఆధారిత డైట్‌ను ఇలా సెట్ చేసుకోండి..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
ప్లాంట్ బేస్డ్ డైట్ పేరుకు తగ్గట్టే మొక్కల నుంచి సేకరించిన ఆహారం ఆరోగ్యానికి మేలైనదని పలువురు ఈ డైట్‌ను ఫాలో అవుతుంటారు. మాంసం, పౌల్ట్రీ, డైరీ ఉత్పత్తులను పక్కనపెట్టి మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎంచుకునే వారు పెరుగుతున్నారు. ఈ తరహా ఆహార నియమాలను అనుసరించేవారు వారానికి తగిన ప్రణాళికతో ముందుకెళితే ఆహార పదార్ధాల ఎంపిక సులువవుతుంది.
వీక్లీ మీల్ ప్లాన్ రూపొందించుకుని అందుకు అనుగుణంగా అవసరమైన పదార్ధాలు, సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. వారంలో ప్రతి రోజూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌కు ఏమేం తీసుకోవాలో ఎంపిక చేసుకోవడం మేలు. ఈ క్రమంలో పలు రకాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, మొక్కల ఆధారిత ప్రొటీన్లను భాగం చేసుకోవాలి. వారానికి సరిపడా అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు లిస్ట్ తయారుచేసుకోవాలి.



తాజా సరుకులను, తోఫు, లెంటిల్స్, నట్స్ వంటి మొక్కల ఆధారిత ప్రొటీన్‌లను సిద్ధం చేసుకోవాలి. ఇక ప్రాసెస్డ్ ఫుడ్ స్ధానంలో పండ్లు, కూరగాయలు, హోల్ గ్రెయిన్స్, నట్స్, సీడ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. మీరు తీసుకునే మొక్కల ఆధారిత ఆహారంలో శరీరానికి అవసరమైన ప్రొటీన్, ఐరన్, క్యాల్షియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బీ12 వంటి పోషకాలు ఉండేలా చూసుకోవాలి.

## లెమన్ వాటర్ ఆరోగ్యానికి మేలు చేసినా పరిమితి మించితే..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం తీసుకుంటే బరువు తగ్గడం, జీర్ణవ్యవస్థ మెరుగవడడం నుంచి విటమిన్ సీ అందడం వరకూ ఎన్నో ఆరోగ్య ప్రయోజాలు ఉన్నాయని చెబుతుంటారు. అయితే లెమన్ వాటర్‌ను మితంగా తాగుతూ ఆరోగ్య సమస్యలను బ్యాలెన్స్ చేస్తూ ఉండాలని అతిగా తీసుకుంటే ఆరోగ్యానికి అనర్ధదాయకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిమ్మరసం అతిగా తాగితే గ్యాస్, అసిడిటీ సమస్యలు ఉన్నవారికి మరింత ఇబ్బంది ఎదురవుతుంది.
నిమ్మకాయల్లో సిట్రిక్ యాసిడ్ ఉండటంతో ఎక్కువగా తీసుకుంటే అసిడిటీ లెవెల్స్ పెరిగి జీర్ణసమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక లెమన్ వాటర్ రుచిగా ఉన్నా పంటి ఆరోగ్యానికి ఇది మంచిది కాదు. రోజూ నిమ్మరసం తీసుకుంటే అందులో ఉండే ఆమ్లాలు పన్నును మరింత సెన్సిటివ్‌గా మార్చుస్తాయి. ఎనామిల్‌ను కాపాడుకునేందుకు నిమ్మరసాన్ని తరచూ తీసుకోకుండా జాగ్రత్తపడాలి.
లెమన్ వాటర్ తీసుకుంటే శరీరం డీహైడ్రేషన్‌కు లోనవదని చెబుతుంటారు. ఇది నిజమే అయినా నిమ్మరసం అధికంగా తీసుకుంటే ఇందుకు విరుద్ధమైన ఫలితాలు కనిపిస్తాయి. నిమ్మరసంలో ఉండే డీటాక్సిఫైయింగ్ పదార్ధాలతో శరీరంలో కీలక ఎలక్ట్రోలైట్స్ విసర్జించబడి డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక లెమన్



వాటర్‌లో ఆమ్లాలు ఎక్కువగా ఉండటం వల్ల దీన్ని అధికంగా తీసుకుంటే ఎముకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. నిమ్మరసాన్ని మితంగా తీసుకుంటే ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు. నిమ్మరసం తీసుకుంటే కొందరిలో అల్సర్, హార్ట్‌బర్న్ వంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. ఏదైనా లెమన్ వాటర్ పూర్తి ప్రయోజనాలను పొందాలంటే పరిమిత మోతాదులో తీసుకుంటూ సమతూకం పాటించడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

## మెగ్నీషియం లోపిస్తే శరీరంలో ఏం జరుగుతుంది..

### ఈ లోపానికి చెక్ పెట్టాలంటే..!

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
సమతులాహారం లోపిస్తే శరీరం పలు వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు లోనవుతుంది. హైపోమెగ్నీషిమియాగా పేరొందిన మెగ్నీషియం ) లోపంతో ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ప్రజలు బాధపడుతున్నారు. కండరాలు, నాడీ వ్యవస్థ పనితీరు, ఎనర్జీ ప్రొడక్షన్, ఎముకల ఆరోగ్యానికి మెగ్నీషియం తగిన మోతాదులో ఉండాలి.
మెగ్నీషియం లోపం తలెత్తితే ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసట, బలహీనత, నీరసం, గుండె దడ, వాంతులు, వికారం, కుంగుబాటు, ఆస్టియోపొరోసిస్ వంటి లక్షణాలు వేధిస్తాయి. మెగ్నీషియం లోపాన్ని నివారించేందుకు ఆహారంలో మెగ్నీషియం తీసుకోవాలి. ఇది శరీరంలో ఆమ్లాలను ప్రేరేపించి మెగ్నీషియంను శరీరం సంగ్రహించేలా చేస్తుంది. మెగ్నీషియంతో పాటు క్యాల్షియం సప్లిమెంట్లను తీసుకోవడం నిలిపివేయాలి.
తగినంత నీరు తీసుకుంటే మెగ్నీషియంతో పాటు పోషకాలను శరీరం సంగ్రహిస్తుంది. ఒత్తిడిని తగ్గించుకోవడం, విటమిన్ డీ తగినంత తీసుకోవాలి. సూర్యరశ్మి సోకేలా చూసుకోవడం ద్వారా శరీరం




మెగ్నీషియంను సంగ్రహించుకునేలా చూసుకోవచ్చు. ప్రేవుల ఆరోగ్యం బాగాఉంటే మెగ్నీషియం సహా పోషకాలను శరీరం మెరుగ్గా గ్రహిస్తుంది. ప్రేవు

# 370 రద్దుతో.. నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ!



డెస్క్, నేటిధాత్రి:
భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు.

ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే, అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని కశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు.

అలాగే కశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను కూకటి వేళ్లతో పెకిలించారు. మోడీ ధృఢసంకల్పానికి, చారిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు.

ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు.

అంతేగాకుండా అందరికీ దూరంగా, అంటరాని పార్టీగా ఉన్న బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతా పార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు.

ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణకాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీంకోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది.

ట్రిపుల్ తలాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది.

అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే కాకుండా ఆయా దేశాలతో సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యతలు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకుని నిలిచేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితులను సమర్థంగా నిభాయించిన నెహ్రూ దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉపప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు.

అంతకుముందు స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ, ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా అటు స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ పాలన సాగించారనడంలో సందేహం లేదు.

అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రాత్మక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు.

ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధానమంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధానమంత్రులుగా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్ర మోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు.

ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది.

2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్ర మోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే.

దేశంలో రాష్ట్ర ప్రభుత్వ అధినేతగా, దేశాధినేతగా నరేంద్ర మోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధానమంత్రి అయ్యారు.

సమర్థ నాయకత్వం, సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డులను బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు.

సాంకేతికంగా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటిసారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠాన్ని అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డును సొంతం చేసుకున్నారు.

# ప్రజాస్వామ్యంలో వరుస విజయాలు అరుదు

- ప్రజానేతగా గుర్తింపు పొందడం కూడా అరుదే
- వరుస విజయాలతో గుర్తింపు పొందిన మోడీ



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్లో విజయం సాధించడం, ప్రజానేతగా గుర్తింపు పొందడం అరుదైన విషయం. ఏ పార్టీ అయినా, ఏ నేత సామర్థ్యానికైనా ఇదే గీటురాయి. అందుకే గెలుపు కోసం రాజకీయ పార్టీలన్నీ నానా తిప్పలు పడుతుంటాయి. రాష్ట్రాల్లో విజయం సాధించటానికే అనేక ధక్కామొక్కీలు తినాలి. ఇక దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడం ఆషామాషీ విషయం కానే కాదు.

దేశ రాజకీయాల్లో రాణించడం, సమర్థ నాయకత్వం, సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఆషామాషీ కాదు. ఒక్కసారి ఎలాగోలా గెలిచినా, వరుసగా రెండోసారి గెలవడం అంత తేలిక కాదు. అలాంటిది వరుసగా మూడోసారి కూడా జయకేతనం ఎగరవేయటం అన్నది కేవలం మోడీకే సాధ్యమైంది.



పుష్కరకాలంగా ప్రధానిగా కొనసాగిన తర్వాత కూడా ఇప్పటికీ దేశంలో అత్యంత ఆదరణ ఉన్న నేతగా మోడీ నిలిచారు. కొన్నాళ్ల క్రితమే అత్యధిక కాలం పదవిలో ఉన్న ప్రభుత్వాధినేతగా మోడీ రికార్డు సృష్టించారు. ఇప్పుడు అత్యధిక కాలం పదవిలో ఉన్న ఎన్నికైన ప్రధానిగా కొత్త రికార్డును తన పేరున లిఖించుకున్నారు.

కాంగ్రెసేతర ప్రధానుల రికార్డులన్నీ తన రెండో టర్మ్‌లోనే బద్దలు కొట్టిన మోడీ, గతేడాది కాంగ్రెస్ ప్రధానుల రికార్డులు బద్దలు కొట్టే పని మొదలు పెట్టారు. మునుపటి ఏడాది ప్రధానిగా ఇందిరా గాంధీ రికార్డును బ్రేక్ చేసిన మోడీ, ఇప్పుడు నవభారత నిర్మాత నెహ్రూ రికార్డును అధిగమించారు.

నరేంద్ర మోడీ 2014 మేలో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందారు. మోడీ సాధించిన ఈ ఘనతకు ఆయన నాయకత్వ పటిమ, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని ప్రజాదరణే ప్రధాన కారణంగా చూడాలి.

మోడీ హయాంలో దేశం దశాబ్దాల నాటి సంకీర్ణ రాజకీయాల అస్థిరత నుంచి బయటపడి పటిష్ఠమైన రాజకీయ సుస్థిరత వైపు అడుగులు వేసింది. ఈ సుస్థిరత వల్లే జీఎస్టీ వంటి క్లిష్టమైన పన్ను సంస్కరణలు, డిజిటల్ ఇండియా విప్లవం, బ్యాంకింగ్ రంగ ప్రక్షాళన వంటి సంచలన నిర్ణయాలు సాధ్యమయ్యాయి.

జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోడీ మార్చివేశారు.

ఇప్పుడు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నరేంద్ర మోడీ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి 2014 మే 21 వరకు ఆ పదవిలో కొనసాగారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించే ముందు 13 సంవత్సరాలకు పైగా గుజరాత్ రాష్ట్రానికి నాయకత్వం వహించారు. 2014 మే 26న భారతదేశ 14వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో లోక్‌సభలో పూర్తి మెజారిటీ సాధించిన తొలి కాంగ్రెసేతర నాయకుడిగా నరేంద్ర మోడీ నిలిచారు. ఆ తర్వాత రెండు పూర్తి పదవీకాలాలు పూర్తి చేసి, వరుసగా మూడోసారి తిరిగి ప్రధానమంత్రి అయిన తొలి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా కూడా ఆయన చరిత్ర సృష్టించారు.

2014లో ఎన్డీఏ కూటమి ద్వారా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నరేంద్ర మోడీ, 2019 ఎన్నికల్లో బీజేపీ భారీగా సీట్లు సాధించడంతో సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ మెజారిటీకి అల్లంత దూరంలో ఆగిపోయింది. దీంతో మిత్రపక్షాల అవసరం పడింది. చంద్రబాబు, నితీశ్ కుమార్ సహకారంతో కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం ఎలా ఏర్పాటైనా, ప్రభుత్వాధినేతగా మోడీ పేరు కాకుండా మరో ప్రత్యామ్నాయం గురించి ఎవరూ ఆలోచించకపోవడం ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనంగా చూడాలి.

మోడీ నెహ్రూ రికార్డును అధిగమించిన ఈ తరుణంలో నాటి, నేటి పరిస్థితులను బేరీజు వేస్తే చాలా తేడా కనిపిస్తోంది. దేశ జనాభా దగ్గర నుంచి రాజకీయ చైతన్యం వరకు ఎంతో మార్పొచ్చింది. అప్పట్లో నెహ్రూ ఎదుర్కొన్న సవాళ్లకు, ఇప్పుడు మోడీ చూస్తున్న సమస్యలకు పొంతనే లేదు.

అత్యంత తీవ్రమైన రాజకీయ పోటీ, ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉన్న తరుణంలో మోడీ సమర్థ నేతగా ఎదిగారు. గుజరాత్ సీఎంగా వరుసగా మూడుసార్లు గెలిచారు. 2014లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏను ఓడించి బీజేపీకి స్పష్టమైన మెజారిటీ తెచ్చిపెట్టారు. అభివృద్ధి మంత్రం, హిందుత్వ సాంస్కృతిక జాతీయవాదంతో మోడీ దేశ రాజకీయాలను మార్చేశారు.

ప్రస్తుతం మోడీకి కూడా కొన్ని సవాళ్లు ఉన్నాయి. రాజకీయ సవాళ్లతో పాటు ప్రధానిగా అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం తీవ్రంగా ఉంది. పశ్చిమాసియా యుద్ధంతో దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయి. దేశంలో రాజకీయ పునరేకీకరణ సాధ్యం చేసిన మోడీ ప్రధానిగానూ, తనకంటే ముందు పనిచేసిన వారు వేసిన బాటను మరింత పటిష్ఠం చేసుకుంటూ వస్తున్నారు. ఎలాంటి పరిస్థితులైనా దేశమే ముందు అని చెబుతున్నారు. ముఖ్యంగా విదేశాంగ విధానం, దౌత్యం విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

# అంటరాని పార్టీ అన్న ముసుగును తొలగించుకున్న బీజేపీ

- బీజేపీని ప్రజలకు చేరువ చేయడంలో మోడీ విజయం
- ప్రాంతీయ పార్టీల నేతలు మోడీతో దోస్తీకి రెడీ
- విజయం సాధించడమే లక్ష్యంగా మోడీ ఎత్తులు
- ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేలా కార్యక్రమాలు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
బీజేపీ అంటే ఒకప్పుడు అంటరాని పార్టీ. బీజేపీ అంటే బ్రాహ్మణుల పార్టీ అనే భావన. కానీ ఇప్పుడా భావన లేదు. బీజేపీ సిద్ధాంతాలను పూర్తిగా మార్చేసిన ఘనత మోడీదే. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే బీజేపీలో చేరాలంటే ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉండాలనే నిబంధనలకు నీళ్లొదిలారు. ఎవరైనా చేరొచ్చని, బీజేపీ కూడా మిగతా పార్టీల్లాంటిదేనని లిబరల్ లుక్ ఇచ్చారు. బీజేపీ అంటే పెద్దగా ఆసక్తి లేనివాళ్లు, అసలు రాజకీయాలపై ఇంట్రస్ట్ లేని వాళ్లు కూడా మోడీని చూసి పార్టీలో చేరుతున్నారని బీజేపీ నేతలే ఒప్పుకుంటున్న పరిస్థితి. ఆ స్థాయిలో బీజేపీలో మోడీ హవా నడుస్తోంది.

వరుస ఎన్నికల్లో విజయాలు ఆయనకు ఆషామాషీగా రాలేదు. అవినీతి కనిపించని పాలన, జనాన్ని ఆకట్టుకునే ప్రసంగాలు, ప్రత్యర్థులను ఆశ్చర్యపరిచే వ్యూహాలు.. ఇలా మోడీ అమ్ములపొదిలో చాలా అస్త్రాలున్నాయి.

దేశంలో కాంగ్రెస్ ధాటికి తట్టుకోలేక ప్రాంతీయ పార్టీల ప్రాపకం కోసం చూస్తున్న బీజేపీకి మోడీ ఆశాకిరణంలా దొరికారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడానికి అన్ని పార్టీలూ అర్రులు చాస్తున్నాయంటే దానికి మోడీ మ్యాజిక్కే కారణం.

కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా బీజేపీలో ఎదిగిన మోడీ.. ఇప్పుడు పార్టీలో సర్వంసహా ఆధిపత్యాన్ని సంపాదించారు. మరే నేతకూ సాధ్యం కాని రీతిలో కొంతవరకు వ్యక్తిపూజ సంస్కృతిని కూడా తీసుకొచ్చారు. పార్టీ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశారు.

దేశంలో రాజకీయం చేయడం ఒక ఎత్తైతే.. ఎన్నికల రాజకీయం మరో ఎత్తు. చాలా మంది నేతలకు ఈ సూక్ష్మం తెలియకే రాజకీయ తెరపై కొంతకాలం వెలిగి తెరమరుగైపోతున్నారు. కానీ మోడీ మాత్రం ఎన్నికల రాజకీయాన్ని పూర్తిస్థాయిలో ఔపోసన పట్టారు.

అసలు ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండగ అని ప్రకటించిన తొలి అగ్రనేత మోడీనే అంటే అతిశయోక్తి కానే కాదు. మిగతా నేతల్లా ఎన్నికలప్పుడే వాటి గురించి ఆలోచించే నేత కాదు మోడీ. అనుక్షణం ఎన్నికల చుట్టే ఆయన ఆలోచనలు తిరుగుతాయి.

ప్రధానిగా లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే చాలనుకునే వ్యక్తి కూడా కాదు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం దక్కింది, కొన్నాళ్లు రిలాక్స్ అవుదాం అని కూడా మోడీ ఆలోచించరు. ఎప్పటికప్పుడు జరుగుతున్న ఎన్నికల గురించే కాకుండా, జరగబోయే ఎన్నికల గురించి కూడా ఆలోచించడం ఆయన నైజం.

అంతకుముందు ఎన్నికలొస్తే చాలు అన్ని పార్టీల మాదిరే బీజేపీ కూడా టెన్షన్ పడేది. పైస్థాయి నేతలకు తగ్గట్టుగానే కిందిస్థాయిలో కార్యకర్తలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉండేవారు. కానీ మోడీ వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఎన్నికలు వస్తే బీజేపీ మరింత ఉత్సాహంగా పనిచేస్తోంది. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు సరికొత్త వ్యూహరచన కనిపిస్తోంది. దీనికి మోడీ ఇచ్చిన స్ఫూర్తే కారణమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.

ఎన్నికలను పండగలా సెలబ్రేట్ చేసుకుని, ప్రజల ఆశీర్వాదం తీసుకునే అద్భుత అవకాశంగా చూడాలనే మోడీ సరికొత్త థియరీ.. ఎన్నికల విషయంలో బీజేపీ దృక్పథాన్నే మొత్తంగా మార్చేసింది. అప్పటి నుంచి ఆ పార్టీకి ఎప్పుడూ ఊహించని ఫలితాలు చాలా అలవోకగా వస్తున్నాయి.

కొన్నిసార్లు బీజేపీ సాధిస్తున్న ఫలితాలను చూసి ప్రత్యర్థులు కూడా ఏదో జరిగిందని అనుమానించే పరిస్థితి. కొందరు ప్రత్యర్థులు బీజేపీ గెలుపు సూత్రాలను కొంతవరకు అర్థం చేసుకున్నా.. ఇంతవరకు ఎవరూ పూర్తిస్థాయిలో మోడీ నాయకత్వంలోని బీజేపీ ఎన్నికల పద్మవ్యూహాన్ని ఛేదించలేకపోయారు.

ఎన్నికల విషయంలో మోడీ పనితీరు, ఆలోచన పద్ధతి ఎలా ఉంటుందో చెప్పటానికి ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని పరిశీలించాల్సిన పని లేదు. గత రెండేళ్ల కాలంలో ఆయన వ్యవహారశైలి చూస్తే సరిపోతుంది. ఎన్నికల ప్రచారం విషయంలో మోడీకి విసుగు లేదు. అలుపు రాదు. తాను ప్రచారం చేసే రాష్ట్రంలో బీజేపీ గెలుపు అవకాశాలు, పార్టీ అస్తిత్వం.. ఇవేవీ ఆయన అసలు పట్టించుకోరు. ఏ రాష్ట్రంలో అయినా, ఏ ప్రాంతంలో అయినా బీజేపీ జెండా ఎగిరేలా చేయటానికి తనకు చేతనైనంత పని చేయాలనే ఏకైక లక్ష్యంతో మోడీ పనిచేస్తారు.

ఎన్నికల ప్రచారం అంటే మూస పద్ధతుల్లో కాకుండా, రాష్ట్రాన్ని బట్టి, అక్కడి ప్రజల ఆలోచనా తీరును బట్టి శైలి మార్చుకోవాలని ఆయన సూచిస్తారు. స్వయంగా పాటిస్తారు కూడా.

బీజేపీ ఎంత ప్రచారం చేసినా దక్షిణాదిలో అనుకున్న ఫలితాలు రావడం లేదన్న ఆ పార్టీ నేతల మాటలను ఆయన లైట్ తీసుకుంటారు. గెలిచేదాకా ప్రచారం చేస్తూనే ఉండాలంటారు. ఆ పట్టుదలతోనే గతంలో బీజేపీ గెలవని ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లో



గెలిచిందనేది మోడీ నమ్మకం.

ఇప్పటివరకు కాషాయ పార్టీ ఖాతా తెరవని రాష్ట్రాల్లోనూ ఇదే సూత్రం అమలుచేయాలనేది మోడీ వ్యూహం. ఇక్కడ కేవలం వ్యూహరచన చేయటమే కాదు.. ఆ వ్యూహాన్ని కచ్చితంగా అమలు చేయడంలోనూ ఆయన ఎప్పుడూ వెనకడుగు వేయరు.

మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో తలమునకలై ఉన్న మోడీ.. ఆ రాష్ట్రాల్లో ప్రచారం చేస్తూనే, వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్‌లోనూ ప్రచారానికి వెళ్లారు. అలా చూసుకుంటే ఎన్నికల ప్రచారం విషయంలో మోడీ అందరికంటే ముందుంటారని చెప్పాలి.

మోడీ ఎన్నికల ప్రచారం కూడా భిన్నంగానే ఉంటుంది. తన ప్రచారానికి ఎంత ఫలితం వచ్చిందో.. తనకు తానుగా బేరీజు వేసుకుంటారు. పార్టీలో తనను అడిగేవారు ఎవరూ లేకపోయినా.. ఆత్మసాక్షికి సమాధానం చెప్పుకునేలా పనిచేయాలనుకుంటారు మోడీ. ఈ చిత్తశుద్ధితో ప్రచారం చేస్తారు కాబట్టి.. మోడీ రోడ్‌షోలు, సభలు చాలావరకు విజయవంతమవుతాయి. దేశంలో ఎక్కువ మంది జనం మోడీతో నేరుగా కనెక్ట్ అవుతున్నారు.

భిన్నాభిప్రాయాలు ఉన్నా, భిన్నమైన రాజకీయ పార్టీల సానుభూతిపరులుగా ఉన్నా.. ఏ సందర్భంలో అయినా మోడీతో కనెక్ట్ అవుతున్నారు. మార్కెటింగ్‌లో కీలకంగా భావించే పబ్లిక్ రిలేషన్ అనే పాయింట్‌ను మోడీ ప్రభావశీలంగా ఉపయోగిస్తున్నారు. సక్సెస్ కూడా అవుతున్నారు.

మెజార్టీ ప్రజలతో మోడీ నేరుగా సంబంధం పెట్టుకున్నారు. మోడీ మన మనిషి అని చాలా మంది అనుకునేలా చేసుకుంటున్నారు. జనంతో మోడీకి ఉన్న ఈ కనెక్షన్ సిద్ధాంతాలు, భావజాలాలు, పార్టీలకు అతీతంగా పనిచేస్తోందని ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి.

ఈ బలమైన బంధమే మోడీని విజేతగా నిలబెడుతోంది.

# ప్రతిపక్ష బాధ లేని నెహ్రూ

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి దేశ జనాభా దాదాపు 34 కోట్లు. కానీ, మోడీ 2014లో పదవి చేపట్టే సమయానికి దేశ జనాభా 131 కోట్లు. ప్రస్తుతం 146 కోట్లు అని అంచనా.

ఇన్నేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా పెరిగింది. దేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1951–52లో 53 రాజకీయ పార్టీలు పోటీ చేశాయి. 2014 లోక్‌సభ ఎన్నికల సమయానికి దేశంలో 464 పార్టీలు పోటీ చేయగా, 2024 ఎన్నికల సమయానికి 744 పార్టీలు పోటీ చేశాయి.



దేశ తొలి ఎన్నికల సమయంలో 17 కోట్ల మంది ఓటు వేయగా, 2014 నాటికి దాదాపు 84 కోట్ల మంది ఓటు వేశారు.

నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అప్పట్లో 489 లోక్‌సభ స్థానాలుంటే, అందులో 364 సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించిన నెహ్రూకు ఆ కాలంలో పెద్దగా జాతీయ స్థాయి ప్రతిపక్షం ఎదురుకాలేదు. ఆయన సెక్యులర్ ఐక్యత సిద్ధాంతంతో దేశాన్ని నడిపించారు.

# గుజరాత్ మోడల్‌తో దూసుకొచ్చిన మోడీ

- దేశ ప్రజల ఆలోచనలపై గురిపెట్టిన గుజరాత్ మోడల్
- వరుసగా ఆరు సాధారణ ఎన్నికల్లో ఘన విజయం
- మూడుసార్లు గుజరాత్ సీఎంగా.. మరో మూడుసార్లు ప్రధానిగా రికార్డు

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజల్ని మెప్పిస్తేనే అధికార పీఠం దక్కుతుంది. ఒక్కసారి అధికారంలోకి రావడమే గొప్ప అనుకుంటున్న తరుణంలో.. దశాబ్దాల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగటం, అందులోనూ సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా ఉండటం చిన్న విషయం కానే కాదు. అందులోనూ విభిన్న రాజకీయ పరిస్థితులు, సవాళ్ల మధ్య కూడా విజయపథంలో కొనసాగాలంటే.. ఆ నేతకు ఏవో ప్రత్యేక లక్షణాలు కచ్చితంగా ఉండాలి. ఆ లక్షణాలే మోడీని సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఎన్నికైన ప్రధానిగా చేశాయి. అసలు మోడీ అధికార ప్రస్థానమే చాలా వింతగా మొదలైంది. ఆ తర్వాత కూడా ప్రతి మలుపులోనూ ప్రత్యర్థులను ఆశ్చర్యచకితులను చేస్తూ.. మోడీ అధికారంలో కొనసాగుతూ వచ్చారు. నరేంద్ర మోడీ రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

వరుసగా ఆరు ఎన్నికల్లో అంటే మూడుసార్లు అసెంబ్లీ, మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో.. ఒక పార్టీని విజయతీరాలకు చేర్చిన ఘనత కూడా ఆయనకే దక్కింది. ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం పనిచేసిన అనుభవంతో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అరుదైన నాయకుడిగా కూడా మోడీ గుర్తింపు పొందారు.

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలను ప్రజలు చూసే కోణం కూడా మారింది. అవినీతిని, అరాచకత్వాన్ని, కుటుంబ పాలనను, పైరవీ రాజ్‌ను, బుజ్జగింపు రాజకీయాలను ఎదుర్కొనే బలమైన ప్రత్యామ్నాయం కావాలనే ఆలోచనను మోడీ రేకెత్తించగలిగారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు, అభివృద్ధి రాజకీయాలకు మధ్య బ్యాలెన్స్ తీసుకురాగలిగారు. మోడీ బ్రాండ్ మేనేజ్‌మెంట్‌లోనే సక్సెస్ సీక్రెట్ ఉందంటున్నారు విశ్లేషకులు. గుజరాత్ సీఎం అయినప్పటి నుంచి ఇప్పటిదాకా.. ప్రతి ఐదేళ్లకు మోడీ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. గుజరాత్ సీఎం అయ్యేనాటికి మోడీకి అసలు ఇమేజే లేదు. ఆయన కేవలం ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మాత్రమే. కానీ 2002లో హిందూ హృదయ సామ్రాట్ అయ్యారు. దీంతో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అనే స్థాయిని దాటేసి.. చాలా పెద్ద హిందుత్వవాదిగా అవతరించారు. మళ్లీ 2007 వచ్చేసరికి మోడీ గుజరాత్‌ను అభివృద్ధి చేసిన సమర్థ పాలకుడిగా బ్రాండ్ సృష్టించారు. ఈ బ్రాండే మరింత పెరిగి గుజరాత్ మోడల్‌గా దేశమంతా ప్రచారమైంది. ఈ గుజరాత్ మోడల్ ప్రభావం ఎంతగా ఉందంటే.. అభివృద్ధికి గుజరాత్‌ను పర్యాయపదంగా మార్చిన మోడీ ప్రధాని అయితే.. దేశం కూడా కచ్చితంగా మారుతుందని మెజార్టీ ప్రజలు నమ్మారు.

అదే మోడీ 2019 ఎన్నికల నాటికి.. దేశాన్ని గర్వపడేలా చేసిన నేతగా రూపాంతరం చెందారు. తర్వాత 2024 ఎన్నికల సమయంలో రాముడిని అయోధ్యకు తెచ్చిన నేతగా బ్రాండ్ సృష్టించుకున్నారు. ఇలా ప్రతి దశలోనూ విపక్షం పోటీ ఇవ్వలేని స్థాయిలో బ్రాండ్ బిల్డింగ్ చేసుకుంటూ విజయప్రస్థానం కొనసాగిస్తున్నారు మోడీ. రాజకీయ అవసరాలకు తగ్గట్టుగా మోడీ సరికొత్త బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించుకుంటూ వచ్చారు. హిందూ హృదయ సామ్రాట్ అనేది గుజరాత్ వరకు సరిపోయింది. దేశ రాజకీయాలపై ఫోకస్ పెట్టగానే.. దేశాన్ని మార్చగల నేతగా అవతరించారు. క్రమంగా వికాస్ పురుష్‌గా, విశ్వగురువుగా తనను తాను ప్రొజెక్ట్ చేసుకున్నారు. ఈ దృక్పథం కార్పొరేట్లను కూడా మెప్పించింది. సుస్థిర సమగ్ర అభివృద్ధి, పెట్టుబడులకు రెడ్ కార్పెట్, అవినీతికి చెక్ లాంటివి అందరికీ నచ్చాయి.

అసలు మోడీ రాజకీయం చేసే తీరే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఒక్కసారి అనుకున్నారంటే.. ఆరు నూరైనా ఆ పనయ్యేదాకా నిద్రపోరు మోడీ. అలాగే మోడీ పొలిటికల్ డిక్షనరీలో అసాధ్యం అనే పదానికి చోటు లేదు. ఎంత కష్టమైనా పడి అనుకున్నది సాధించాలనే తపనతో పనిచేస్తారు. మోడీ రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారు. సాధారణ రాజకీయ నేతలు సంకోచించే నిర్ణయాలను కూడా ఆయన అలవోకగా తీసుకుంటారు. ఆ లక్షణాన్ని తన బలంగా చెప్పుకుంటారు మోడీ. దేశంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి వస్తుందనే విషయం కూడా ఎవ్వరి ఊహకూ అందని విషయం. దాన్ని ఒక్కసారి కాదు.. ఏకంగా రెండుసార్లు సాధ్యం చేశారు మోడీ. అంతేకాదు వరుసగా మూడోసారి కూడా మిత్రుల మద్దతుతో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు.

ఇలా తన పనైపోయిందని ప్రత్యర్థులు భావించిన ప్రతిసారీ.. దిమ్మతిరిగే జవాబిచ్చిన ట్రాక్ రికార్డు ఆయనకు ఉంది. బలహీనతలను కూడా క్రమంగా బలాలుగా మార్చుకోవడం ఎలాగో మోడీ స్వీయ అనుభవంతో నేర్చుకున్నారు.

అందుకోసం సరికొత్త వ్యూహాల అమలుకు, వినూత్న ఆలోచనలు చేయటానికి ఆయన ఎప్పుడూ వెనుకాడరని సహచరులు చెబుతుంటారు.

2024 లోక్‌సభ ఎన్నికలను ప్రామాణికంగా తీసుకుంటే.. ఆ ఎన్నికల్లో మిత్రులతో కలిసి మోడీ విజయం సాధించారు. హ్యాట్రిక్ పీఎం అనే ట్యాగ్ వచ్చినా.. ఆయన ఎక్కడా విశ్రాంతి తీసుకోలేదు.

ఆ ఎన్నికల తర్వాత కొన్ని నెలల వ్యవధిలో వచ్చిన మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలకు ముందే వ్యూహరచన చేశారు. ఎన్నికలు రాగానే ఆ వ్యూహాన్ని పక్కాగా అమలు చేసి.. అనుకున్న ఫలితాన్ని సాధించారు.

అక్కడితో ఆగితే ఆయన మోడీ ఎందుకవుతారు. అసలు ఎన్ని విజయాలు సాధించినా తృప్తి పడటం మోడీకి ఇష్టం ఉండదు. రాజకీయ నేతగా ఒక్క గెలుపుతోనో, కొన్ని విజయాలతోనే సంతృప్తి చెందితే.. ఇక భవిష్యత్తు ఉండదనేది ఆయనకు ఆయనగా పెట్టుకున్న రాజకీయ సూత్రం.

దేశంలోనే అత్యంత విజయవంతమైన నేతగా ఉన్నా కూడా మోడీ తాను పెట్టుకున్న సూత్రాల విషయంలో రాజీ పడరు. ఓవైపు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూనే.. మరోవైపు వ్యక్తిగతంగా తన రాజకీయ సూత్రాలను కూడా మేళవించి ఎన్నికల్లో ప్రయోగించడం మోడీకి అలవాటు.

ఈ వెర్షన్‌లో భావం, పేరాగ్రాఫ్ నిర్మాణం, రాజకీయ వ్యాఖ్యానం ఏదీ మార్చకుండా కేవలం అక్షరదోషాలు, టైపింగ్ పొరపాట్లు, విరామచిహ్నాలు మరియు వ్యాకరణ దోషాలు మాత్రమే సవరించబడ్డాయి.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01.
Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999